## అంగన్వాడీటీచర్‌కు నివాళులర్పించిన బీర్ల అయిలయ్య



నవతెలంగాణ- తుర్కపల్లి

మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు పత్తిపాటి హనుమంత రావు సతీమణి అంగన్వాడీ టీచర్ పత్తి పాటి పారిజాత అనారోగ్యంతో మృతిచెందగా తన మృతదేహానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. అనంతరం ఆర్థిక సహాయం అందజేశారు. కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేసారు. ఆయన వెంట ఆ పార్టీ కార్యకర్తలు, నాయకులు ఉన్నారు.




అనుదినం జనస్వరం

# నవతెలంగాణ

సమగ్ర తెలుగు దినపత్రిక

నల్లగొండ, సూర్యాపేట, యాదాద్రిభువనగిరి

1

శనివారం 25 ఫిబ్రవరి 2023


## నీటి సంపులోపడి రైతు మృతి



నవతెలంగాణ- భువనగిరిరూరల్

ప్రమాదవశాత్తు రైతు నీటి సంపులో పడి మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని నమత్ పల్లి గ్రామంలో శుక్రవారం మధ్యాహ్నం జరిగింది. స్థానికులు, బాధితులు తెలిపిన వివరాల ప్రకారం నమాత్తు పల్లి గ్రామానికి చెందిన జిట్ట వెంకటరెడ్డి ( 41) రోజువారి పనిలో భాగంగా తన వ్యవసాయ బాయి వద్దకు వెళ్లాడు. ప్రమాదవశాత్తు నీటి సంపులో పడి మృతి చెందాడు.

# ప్రజాపోరాటాలతో సమస్యలు పరిష్కరించుకోవాలి

- సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి



నవతెలంగాణ-సూర్యాపేట

కేంద్ర ,రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటాలు చేయడం ద్వారానే ప్రభుత్వాల మెడలు వంచి సమస్యలు పరిష్కారం చేసుకోగలుగుతామని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి అన్నారు.శుక్రవారం స్థానిక హైటెక్ బస్టాండ్ సమీపంలోని శ్రీ లక్ష్మీగార్డెన్స్‌లో పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు నెమ్మాది వెంకటేశ్వర్లు అధ్యక్షతన నిర్వహించిన జిల్లావిస్తృతస్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు.కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం ప్రజాధనాన్ని కొల్లగొడుతూ పెట్టుబడిదారులకు ఊడిగం చేస్తుందన్నారు.దేశంలోని 10 శాతం మంది చేతుల్లో 100శాతం సంపద దాగి ఉందన్నారు.మోడీ పాలనలో పేద మధ్య తరగతి ప్రజలపై భారాలు మోపుతూ పెద్దలకు రాయితీలు కల్పించడం దుర్మార్గమన్నారు.ఆదాని కంపెనీలలో జరుగుతున్న ఆర్థిక మోసాలను హిడెన్‌బర్గ్ సంస్థ బట్టబయలు చేసిన విచారణ జరపకపోవడం దారుణమని విమర్శించారు.దేశవ్యాప్తంగా బీజేపీ పాలనకు వ్యతిరేకంగా భావ సారూప్య పార్టీలతో పోరాడుతామన్నారు. కేంద్ర పాలన వ్యతిరేకంగా మతోన్మాద భావజాలానికి వ్యతిరేకంగా జరిగే పోరాటంలో అభ్యుదయవాదులు మేధావులు అన్ని వర్గాల ప్రజలు కలిసి రావాలని ఆయన పిలుపునిచ్చారు. రాష్ట్రంలో ఎన్నికల వాతావరణం సృష్టించబడిందని తెలిపారు.పాదయాత్రల పేరుతో ప్రజల మధ్యకు వెళ్లి కొన్ని పార్టీలు మరొకసారి ప్రజలను వంచించాలని చూస్తున్నాయన్నారు.తెలంగాణ రాష్ట్రంలో బీజేపీని అడుగు పెట్టనివ్వకుండా అడ్డుకుంటామన్నారు.కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న మతోన్మాద భావజాలానికి వ్యతిరేకంగా రాష్ట్రంలో ప్రచార క్యాంపియన్ చేపడుతామని తెలిపారు.రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయడం కోసం ప్రజలను చైతన్యవంతం చేస్తూ సమస్యల పరిష్కారం కోసం పోరాటాలు ఉధృతం చేస్తామన్నారు. ఈ సమావేశంలో పార్టీ జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జునరెడ్డి, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కొలిశెట్టి యాదగిరిరావు, బుర్రి శ్రీరాములు, రవినాయక్, మేదరమెట్ల వెంకటేశ్వరరావు, కోట గోపి, నాగారపు పాండు, చెరుకు ఏకలక్ష్మి, జిల్లా కమిటీ సభ్యులు జిల్లేపల్లినర్సింహారావు, వేల్పుల వెంకన్న, ఎలుగూరి గోవిందు, మేకనబోయిన సైదమ్మ, కొప్పుల రజిత, మేకనబోయినశేఖర్, ధనియాకుల శ్రీకాంత్, వీరబోయినరవి, చిన్నపంగి నర్సయ్య,కందాలశంకర్‌రెడ్డి, బుర్ర శ్రీనివాస్, పులుసు సత్యం, కొదమగుండ్ల నగేష్, ఎస్‌కె.యాకుబ్, అనంతప్రకాశ్, పాండునాయక్, పల్లా వెంకట్‌రెడ్డి, దుగ్గి బ్రహ్మం,వట్టెపు సైదులు, దేవరం వెంకట్‌రెడ్డి,మిట్టగనుపుల ముత్యాలు,బెల్లంకొండ సత్యనారాయణ, ప్రజాసంఘాల నాయకులు ములకలపల్లి రాములు, రాంబాబు, బచ్చలకూరి రాంబాబు,మర్రి నాగేశ్వరరావు, కాసాని కిషోర్ పాల్గొన్నారు.



# వటపత్రసాయి అలంకరణ సేవలో నరసింహుడు

- వైభవంగా కొనసాగుతున్న బ్రహ్మోత్సవాలు
- నరసింహుని సన్నిధిలో గవర్నర్ తమిళసై

నవతెలంగాణ- యాదగిరిగుట్ట

యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు శుక్రవారం నాలుగో రోజుకు చేరుకున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ఉదయం నిత్యారాధనల అనంతరం లక్ష్మీ నరసింహ స్వామిని వటపత్రసాయిగా అలంకరించి ప్రధాన అర్చకుల ఆధ్వర్యంలో యజ్ఞాచార్యులు, ఉప ప్రధానార్చకులు, అర్చక బృందం, పారాయనీకులు అత్యంత వైభవంగా ఆలయ ప్రాకారములలో ఊరేగించారు.. వటపత్రశాయి అనగా మర్రి ఆకుపై పవళించిన పరమాత్మ బాలముకుందా స్వరూపం సృష్టికి పూర్వం సమస్త జగత్తులను తన ఉదరములో నిలుపుకొని కరారవిందముతో తన పదారవిందములను ముఖారవిందములో నిలుపుకొని సమస్త చరాచర ప్రకృతి స్వరంపములకు అమృత ధారలను అందించిన అపూర్వతత్వం వటపత్రసాయి స్వరూపం అని పేర్కొన్నారు. ఈ వేడుకలో తెలంగాణ రాష్ట్ర గవర్నర్ తమిళసై, యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి, అడిషనల్ కలెక్టర్ దీపక్ తివారి, ఆలయ అనువంశిక ధర్మకర్త బి నరసింహమూర్తి, కార్యనిర్వహణాధికారి ఎన్ గీత తదితరులు పాల్గొన్నారు.



**గవర్నర్ తమిళసై సౌందర్యరాజన్ రాక**

బ్రహ్మోత్సవాల్లో భాగంగా గవర్నర్ అలంకార సేవలో ఉదయం పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. తొలుత గవర్నర్ తమిళ సై సౌందరరాజన్‌కు ప్రధాన అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. దర్శనం అనంతరం ఆమెకు అర్చకులు వేద ఆశీర్వాదం చేశారు. ఈఓ గీతారెడ్డి లడ్డు ప్రసాదం అందజేశారు.

**ఉచిత వైద్య శిబిరం**

బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో కొండపైన బస్టాండ్ వద్ద, కొండ క్రింద కళ్యాణకట్ట వద్ద ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులకు ఆరోగ్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైద్యులు వంశీకృష్ణ, హరీష్ తదితరులు పాల్గొన్నారు.



## రికార్డుల నిర్వహణ పారదర్శకంగా చేపట్టాలి

- జెడ్పీ సీఈవో ప్రేమ్‌కరణ్‌రెడ్డి

నవతెలంగాణ-నిడమనూరు

రికార్డుల నిర్వహణ అదికారులు పారదర్శకంగా నిర్వహించాలని జడ్పీ సీఈఓ ప్రేమ్‌కరణ్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని ముప్పారం బొక్కమంతల పాడ్ గ్రామాల్లోని పల్లె ప్రకృతి వనాలను పరిశీలించారు. అనంతరం అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనలో రాజీ లేకుండా తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రధాన సమస్యలను గుర్తించి వాటిని వేంటనే పూర్తి చేయాలని పేర్కొన్నారు. ఉపాధి హామీ పనులనూ గుర్తించి అవసరమైన ఏర్పాట్లు చేయాలని తెలిపారు. ఆయన వెంట ఎంపీడీఓ కే. ప్రమోద్‌కుమార్, ఏపీఓ శ్రినయ్య తదితులున్నారు.

# డాక్టర్ ప్రీతికి న్యాయం చేయాలి

- విద్యార్థి నాయకులను అరెస్ట్ చేయడం అన్యాయం



నవతెలంగాణ-నల్లగొండ కలెక్టరేట్

సీనియర్ విద్యార్థి ర్యాగింగ్ చేయడంతో ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించిన డాక్టర్ ప్రీతికి న్యాయం చేస్తూ ర్యాగింగ్‌కు పాల్పడిన సీనియర్ విద్యార్థిపై కఠినమైన చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆకారపు నరేష్, ఖమ్మంపాటి శంకర్ డిమాండ్ చేశారు. బాధిత విద్యార్థికి న్యాయం చేయాలని కోరుతూ శుక్రవారం ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నల్లగొండ పట్టణంలోని మెడికల్ కళాశాల బాయ్స్ హాస్టల్ ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత మూడు రోజుల క్రితం వరంగల్ కేఎంసీ మెడికల్ కళాశాలలో పీజీ మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థి ప్రీతిని సీనియర్ విద్యార్థి అయిన సైఫ్ ర్యాగింగ్ చేసి తీవ్రమైన మనస్థాపానికి గురి చేశాడని ఆరోపించారు. కళాశాల ప్రిన్సిపాల్‌కు ఫిర్యాదు చేసిన చర్యలు తీసుకోకపోగా తిరిగి బాధిత విద్యార్థినే మందలించడంతో ఆత్మహత్యయత్నానికి పాల్పడిందని పేర్కొన్నారు. ప్రస్తుతం నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ చావు బ్రతుకుల మధ్య కొట్టుమిట్టాడుతుందని, దీనికంతటికి ర్యాగింగ్‌గే కారణమని కళాశాల యజమాన్యం ర్యాగింగ్‌ను అరికట్టడంలో విఫలమయ్యారని ఆరోపించారు. అన్యాయంపైన ప్రశ్నిస్తున్న విద్యార్థి నాయకులను అరెస్ట్ చేయడం బాధాకరమని, వెంటనే వారిని విడుదల చేయాలని డిమాండ్ చేశారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. విద్యార్థిని కుటుంబానికి న్యాయం జరిగే వరకు పోరాటం చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి కుర్ర సైదా నాయక్, దీపక్, రఘు, విశాల్, సుమంత్, మురళి, సాయి, రాహుల్, చరణ్, మెడికల్ కళాశాల విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



## గ్రామాలభివృద్ధికి కృషి

నవతెలంగాణ-కోదాడరూరల్

గ్రామాలను అభివృద్ధి చేసి గ్రామ స్వరాజ్యాన్ని ప్రభుత్వం సాధిస్తుందని ఎంపీపీ చింతా కవితా రాధారెడ్డి అన్నారు. శుక్రవారం మండలపరిధిలోని చిమిర్యాల గ్రామంలో మహాత్మాతీయ ఉపాధిహామీచట్టం నిధులు రూ.30 లక్షల వ్యయంతో నిర్మిస్తున్న సీసీరోడ్ల నిర్మాణపనులకు ఆమె శంకుస్థాపన చేసి మాట్లాడారు.గత పాలకుల హయాంలో గ్రామాల్లో మౌలిక సదుపాయాలు లేక గ్రామాలు పూర్తిగా వెనకబడి పోయాయన్నారు.కేసీఆర్ అధికారంలోకి వచ్చిన తర్వాత గ్రామాల రూపు రేఖలు మరాయన్నారు.ఈకార్యక్రమంలో సర్పంచ్ కొండ శైలజ,మండలఉపాధ్యక్షులు గడుపూడి శ్రీకాంత్ ,ఎంపీటీసీ కలకొండ సౌజన్య బాలకృష్ణ,గ్రామశాఖ అధ్యక్షుడు పెంట్యాల విష్ణువర్ధన్‌రావు, పార్టీ కార్యదర్శి నల్లూరి అప్పారావు, కాంగ్రెస్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ కొండ పూర్ణచంద్రరావు,సత్యం, వార్డుసభ్యులు కలకొండ దేవమని, దావీదు,గూడపురి నగేశ్, నాగవరపు జాను,వెంకటయ్య,కలకొండ ఆదినారాయణ, పుల్లూరి బాబు, నందిగామ రాజశేఖర్ ,ఆనంద్,గురోజ్,లింగారావు, బాబు, బూసి, సుందర్‌రావు,రాజా తదితరులు పాల్గొన్నారు.

## 'వీధి కుక్కలను నివారిద్దాం..పసి పిల్లల ప్రాణాలను కాపాడుదాం'





నవతెలంగాణ-మిర్యాలగూడ

వీధి కుక్కలను నివారించి పసిపిల్లల ప్రాణాలను కాపాడాలని మెప్మా జిల్లా కోఆర్డినేటర్ కే.శివాజీనాయక్ కోరారు. పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ మెప్మా పురపాలక సంఘం ఆధ్వర్యంలో పట్టణంలోని పలు పాఠశాలల్లో బకల్వాడ, స్కూల్ శివాని స్కూల్‌లో స్లం సమాఖ్యలో శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుక్కలకు ఆహారం, నీరు దొరకక వాతావరణంలో మార్పులుస్తున్న కారణంగా వేడి ఎక్కువైనప్పుడు కుక్కలు ఏదో ఒక రకమైన ఆహారం కోసం పసిపిల్లల మీద దాడి చేసి వాళ్లను చంపుతున్నాయని తెలిపారు. అందుకే తల్లిదండ్రులు పిల్లలను రోడ్లమీద ఒంటరిగా వదలకుండా వారి చేతుల్లో తిరుగుబండారాలు ఉండకు అలాగే చిన్న పిల్లల్ని స్కూలుకు తల్లిదండ్రులు తీసుకొని వెళ్లి తీసుకొని రావాలని వారిని ఒంటరిగా వదులుద్దని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో టౌన్ మిషన్ కోఆర్డినేటర్ పీ.బక్కయ్య, మున్సిపల్ శానిటరీ ఇన్స్‌పెక్టర్ వెంకటరమణ, మెప్మా సీఈవోలు, శ్రీనివాస్ వెంకటేశ్వర్లు, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, మేనేజ్మెంట్, మెప్మా రిసోర్స్ పర్సన్స్, ఎస్ఎల్ఎఫ్ అధికారులు పాల్గొన్నారు.

**కుక్కల నివారణపై అవగాహన**

**నల్లగొండకలెక్టరేట్ :** నల్లగొండ మున్సిపాలిటీ పరిధిలో కుక్కల నివారణపై మహిళా సంఘాల ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాన్ని చేపట్టారు. అందులో భాగంగా శుక్రవారం నల్లగొండ పట్టణంలోని 38వ వార్డుల గల హనుమాన్‌నగర్‌లో కాలనీవాసులకు అవగాహన కలిగించారు. ఈ సందర్భంగా మెప్మా సీవో అనిల్ మాట్లాడుతూ కుక్కల పట్ల జాగ్రత్తగా ఉండాలని, స్కూల్ విద్యార్థులు ఒంటరిగా వెళ్లకుండా గుంపులుగా వెళ్లాలని తెలిపారు. కాలనీ వాసులు, మటన్, చికెన్ షాపు యజమానులు మిగిలిన ఆహార పదార్థాలను, వ్యర్థాలను వీధులలో పడవేయరాదని, కుక్కలు గుంపుగా కనబడితే మున్సిపల్‌శాఖ టోల్ ఫ్రీ నెంబర్ 14420, లేదా 08682- 220100కు కాల్ చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్‌పీలు నాగలక్ష్మి, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## దివిస్ సామాజిక సేవలు అభినందనీయం



నవతెలంగాణ - చౌటుప్పల్ రూరల్

గ్రామాల్లో దివిస్ పరిశ్రమ యాజమాన్యం చేస్తున్న సామాజిక సేవలు అభినందనీయమని చౌటుప్పల్ వైస్ ఎంపీపీ ఉప్పు భద్రయ్య అన్నారు. మండలంలోని అంకిరెడ్డిగూడెం గ్రామంలో దివిస్ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులకు ఉచిత హెల్త్ క్యాంపు నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థుల ఆరోగ్యం పట్ల శ్రద్ధ చూపడం మంచి పరిణామన్నారు. గ్రామ సర్పంచ్ గ్రామంలో సీసీ రోడ్లు, వాటర్ పంపులు, ఆర్థిక సహకారం అందించారని అన్నారు. డాక్టర్ శశిధర్ 178 మంది విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం ఉచితంగా మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలోదివిస్ సిఎస్ఆర్ ఇన్చార్జ్ వల్లూరి వెంకటరాజు,వెంకటేశ్వర్లు,వంశీకృష్ణ, ప్రధానోపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## అయిలయ్యకు మెజీషియన్ సర్టిఫికెట్



నవతెలంగాణ-చౌటుప్పల్

ఈ నెల 23న హైదరాబాద్‌లోని పొట్టి శ్రీరాములు విశ్వవిద్యాలయంలో నిర్వహించిన మెజీషియన్‌లో చౌటుప్పల్ పట్టణానికి చెందిన సామాజిక కార్యకర్త గుణమోని అయిలయ్యకు బీసీ కార్పొరేషన్ ఛైర్మన్ బుర్ర వెంకటేశం మెజీషియన్ సర్టిఫికెట్ అందజేశారు. సమాజంలో మూఢ నమ్మకాలను పారదోలేందుకు ప్రజలను చైతన్యవంతులను చేస్తున్న అయిలయ్యను పూలమాలలు, శాలువాలతో సన్మానించి సర్టిఫికెట్ అందజేసి, అభినందించారు.





# ఇసుక తరలించొద్దని రైతుల నిరసన



నవతెలంగాణ- ఆలేరురూరల్

ఆలేరు మండలంలోని కొలనుపాక పెద్దవాగు నుండి ఇసుక తరలించవద్దని శుక్రవారర రైతులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ గ్రామంలో వారానికి రెండుసార్లు తహసీల్దార్ పర్మిషన్ ఇవ్వడంతో ఒక ట్రాక్టర్ పది ట్రిప్పుల ఇసుక తరలిస్తున్నారని వారికి మాత్రం మూడు ట్రిప్పులకే పర్మిషన్ ఇస్తున్నాడని ట్రాక్టర్ల దగ్గర విలేజ్ రెవెన్యూ అసిస్టెంట్ ఉండాలని రైతులు గంటసేపు నిరసన వ్యక్తం చేశారు విషయం తెలుసుకున్న పోలీస్ సిబ్బంది రైతుల నిరసన కార్యక్రమాన్ని ఆపివేయాలని సూచించారు. వారానికి 2 సార్లు పర్మిషన్ ఇచ్చి సుమారు 400 ట్రిప్పులు ఇసుక తోడేస్తున్నారని మండిపడ్డారు. పక్కనే ఉన్న రైతులు అసలే ఎండాకాలం నీటి ఎద్దడి ఉన్నదని అధికారులు మాత్రం రైతులను ఏ విధంగా పట్టించుకోవడంలేదన్నారు. రెండు సార్లు కాకుండా నెలకు ఒకసారి పర్మిషన్ ఇచ్చి రైతులను ఆదుకోవాలని కోరారు. నిరసన వ్యక్తం చేసిన వారిలో రైతులు ప్రభాకర్, సురేష్ ,నరేందర్ ,రాజు, కనకయ్య, నాగరాజు ,బాల నరసింహ, తదితరులు ఉన్నారు.

**సమస్య రాకుండా చూస్తాను**

**మండల తహసీల్దార్ రామకృష్ణ**

ఇప్పటినుండి ఇలాంటి సమస్య రాకుండా చూస్తాను. నెలకు ఒకసారి పర్మిషన్ ఇస్తాను. ట్రాక్టర్ల దగ్గర విలేజ్ రెవెన్యూ అసిస్టెంటును ఉంచుతాను. పర్మిషన్ లేకుండా ట్రాక్టర్ నడిస్తే కఠిన చర్యలు తీసుకొని సీజ్ చేస్తాను.

## బస్తీ ప్రోగ్రాం

నవతెలంగాణ - భువనగిరి

పట్టణంలోని బస్తీ ప్రోగ్రాం కార్యక్రమంలో భాగంగా సమ్మద్ చౌరస్తా నుండి జంఖానా గూడెం వరకు, దగ్గర ఉండి అండర్ డ్రెయినేజీ పనులను కౌన్సిలర్ పంగరెక్కల స్వామి శుక్రవారం పరిశీలించారు. ఈ కార్యక్రమంలో కో ఆప్షన్ సభ్యులు, ఇట్టబోయిన సబిత, గోపాల్. పట్టణ పార్టీ అధ్యక్షులు , ఎవికిరణ్ కుమార్ కార్యదర్శులు, రచ్చ శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.



# దొంగతనం కేసులో నిందితుడి అరెస్టు

**చింతలపాలెం పీఎస్‌లో 7 కేసులు నమోదు**

**రూ.13.5 లక్షల విలువగల ఆభరణాలు స్వాధీనం**

**ఎస్పీ రాజేంద్రప్రసాద్**

నవతెలంగాణ-సూర్యాపేట

తాళం వేసిన నివసాలే టార్గెట్ చేసి తాళం పగలగొట్టి దొంగతనాలు చేస్తున్న దొంగను పోలీసులు అరెస్ట్ చేసిన సంఘటన జిల్లాలో శుక్రవారం చోటుచేసుకుంది.ఈ సందర్భంగా జిల్లా పోలీసు కార్యాలయం లో ఎస్పీ రాజేంద్ర ప్రసాద్ కేసు వివరాలను వెల్లడించారు. జిల్లా లోని చింతలపాలెం మండలం ఎర్రకుంట తండా కు చెంది వాంకుడోతు నాగరాజు మండలపరిధిలో పగలు సమయంలో బయటి నుంచి ఇంటికి తాళాలు వేసిన ఇండ్లను లక్ష్యంగా చేసుకొని దొంగతనాలకు పాల్పడుతున్నాడు.మండలపరిధిలో నిందితుడు వివిధప్రాంతాలలో,గ్రామాలలో తిరుగుతూ ఇంటికి తాళాలువేసి వ్యవసాయ పనులకుగానీ, ఫంక్షన్‌లకుగానీ వెళ్లిన వారి ఇండ్లను లక్ష్యంగా చేసుకొని పగలు సమయంలో ఇంటి తాళాలుపగలగొట్టి ఇళ్లలో ఉన్న బంగారం, వెండి ఆభరణాలతో పాటు దొరికినంత డబ్బును దొంగిలించుకెళ్తాడు.గతంలో ఇతను చిన్న, చిన్న దొంగతనాలకు పాల్పడ్డాడు.ఈ క్రమంలో శుక్రవారం చింతలపాలెం మండలం,దొండపాడు గ్రామంలోని ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంకు వద్ద చింతలపాలెం ఎస్ఐ, సిబ్బందితో వాహనాలు తనికి చేస్తుండగా చింతలపాలెం వైపు నుండి జగ్గయ్యపేటవైపు ద్విచక్ర వాహనంపై వెళ్తున్నాడు.అక్కడున్న పోలీసులను చూసి తడబడుతూ అనుమానాస్పదంగా పారిపోయాడు.పోలీసులు అతన్ని పట్టుకుని విచారించగా చింతలపాలెం మండల పరిదిలోని చింతలపాలెం, దొండపాడు, తమ్మారం, ఎర్రకుంటతండా, నక్కగూడెం గ్రామాలలోని ఇండ్లలో( తేదీ 02-01-2023 నుండి 17-02-2023 వరకు) దొంగిలించిన బంగారు, వెండి ఆభరణాల తీసుకెళ్లినట్టు ఒప్పుకున్నాడు.వీటిని కృష్ణా జిల్లా, జగ్గయ్యపేటలో అమ్ముదామని జగ్గయ్యపేటకు వెళ్తుండగా దొండపాడులోని పెట్రోల్ బంకు వద్ద పోలీసులు పట్టుకుని అతని నుండి బంగారం 23.2 తులాలు బంగారం, 63 గ్రాములు వెండి స్వాధీనం చేసుకోవడంతో పాటు అరెస్టు చేశారు.కేసు డిటెక్ట్ చేయడంలో ఎప్పటికప్పుడు పర్యవేక్షించిన కోదాడ డీఎస్పీ జి.వెంకటేశ్వర్‌రెడ్డి, ప్రత్యేక దృష్టి పెట్టిన కోదాడ రూరల్ సీఐ పీఎన్‌డీ.ప్రసాద్, చింతలపాలెం ఎస్ఐ ఎం.కృష్ణారెడ్డి, హెచ్‌సీలు లక్ష్మయ్య, వెంకటేశర్లు, పీసీ నాగరమేష్, ఎం.రామారావు, హెచ్‌జీలు రవి,లచ్చయ్యలను ఎస్పీ అభినందించారు.

అనునిత్యం జనపక్షం
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నల్లగొండ
2
శనివారం 25 ఫిబ్రవరి 2023



## ప్రజలు మున్సిపల్‌శాఖకు సహకరించాలి

**నవతెలంగాణ-నల్లగొండ కలెక్టరేట్**

నల్లగొండ పట్టణ ప్రజలు అభివృద్ధి, ఆరోగ్యరీత్యా మున్సిపల్‌శాఖ ఆధ్వర్యంలో నిర్వహించే కార్యక్రమాలకు సహకరించాలని మున్సిపల్ కమిషనర్ డాక్టర్ కేవీ.రమణాచారి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు, హోటల్ యజమానులు, చిరు వ్యాపారులు, ప్రభుత్వ, ప్రయివేటు హాస్టల్‌లోని యజమానులు, ఆహారం తయారు చేసిన తర్వాత ఉపయోగించిన అనంతరం మిగిలిన ఆహారాన్ని వీధులలో, కుక్కలకు, పందులకు వేయరాదన్నారు. మిగిలిన ఆహారాన్ని వీధులలో ఎక్కడపడితే అక్కడ వేయటం వల్ల పట్టణంలో కుక్కల బెడద ఎక్కువైందని పేర్కొన్నారు. ఇంటి ఆవరణలో గొయ్యి తీసి అందులో వేయాలని కోరారు. దీంతో వన్ సైట్ కంపోస్టింగ్ తయారవుతుందని దానిని ఇంటి పరిసరాలలోని మొక్కలకు ఎరువుగా వాడుకోవచ్చు అన్నారు.

## సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

**నవతెలంగాణ-కేతపల్లి**



రైతులు వరిలో ఎప్పటికప్పుడు సస్యరక్షణ చర్యలు చేపట్టి అధిక దిగబడును పొందాలని కేతపల్లి మండల వ్యవసాయ అధికారి బీ.పురుషోత్తం అన్నారు. మండలంలోని గుడివాడ గ్రామంలోని రైతుల వరి పొలాలను శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఏఓ పురుషోత్తం మాట్లాడుతూ ప్రస్తుతం వరి పొలాలు ఈనిక దశలో ఉన్నాయని చెప్పారు. పొలాల్లో వచ్చే రోగాలు, వాటికి తీసుకోవాల్సిన నివారణ చర్యలపై రైతులకు అవగాహన కల్పించారు. రైతులు తమ పరిధిలోని వ్యవసాయశాఖ అధికారులను సంప్రదించి వరి పొలంలో తగు నివారణ చర్యలను చేపట్టాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో రైతులు రాచకొండ యాదగిరి, అలకుంట్ల అంజయ్య, జానయ్య, ఏఈఓ వీరేష్ పాల్గొన్నారు.

# దేశం గర్వించదగ్గ సంఘసంస్కర్త సేవాలాల్

- జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యే కంచర్ల

**నవతెలంగాణ-నల్లగొండ**

సంత్ సేవా లాల్ గిరిజనుల ఆరాధ్య దైవం, దేశం గర్వించదగ్గ గొప్ప సంఘ సంస్కర్త, ఆధ్యాత్మిక వేత్త సంత్ సేవాలాల్ అని జిల్లా కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి, స్థానిక ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని క్లాక్ టవర్ వద్ద శుక్రవారం నిర్వహించిన సంత్ సేవాలాల్ 284 వ జయంతి వేడుకలకు ట్రైకార్ చైర్మెన్ రాంచంద్రనాయక్, బంజారా సంఘం జిల్లా అధ్యక్షుడు ప్రవీణ్‌నాయక్‌తో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి జయంతి ఉత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కంచర్ల మాట్లాడుతూ సేవాలాల్ చూపిన మార్గంలో ప్రతి ఒక్కరు నడవాలన్నారు. జిల్లాలో బంజారా భవన్‌కు స్థలం కేటాయింపు కు సర్వే చేయాలని జిల్లా కలెక్టర్‌ను కోరారు. జిల్లా మంత్రి



సహకారంతో భవన నిర్మాణంకు నిధులు మంజూరుకు కృషి చేస్తానన్నారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ సంత్ సేవాలాల్ జయంతిని 2015 నుండి అధికారికంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సంత్ సేవాలాల్ మహారాజ్ చూపిన మార్గంలో నడుస్తూ, ఆయన ఆశయాల సాధనకు కృషి చేసినప్పుడే ఆ మహనీయుడికి నిజమైన నివాళి అర్పించినట్లు అవుతుందన్నారు. ట్రైకార్ చైర్మెన్ రాంచంద్రనాయక్ మాట్లాడుతూ సంత్ సేవాలాల్ మత్తు, ధూమ పానం శాపమని హితవు పలికి బంజారా జాతికే కాదు యావత్తు దేశంలోనే అందరికీ ఆదర్శపురుషుడయ్యారన్నారు. ఈకార్యక్రమంలో జిల్లా గ్రంధాలయ సంస్థ చైర్మెన్ అర్.మల్లికార్జున్‌రెడ్డి, మున్సిపల్ చైర్మెన్ మందడి సైదిరెడ్డి, వైస్ చైర్మెన్ అబ్బగొని రమేష్, జిల్లా గిరిజన సంక్షేమ అధికారి రాజ్‌కుమార్, తిరుమల గిరి ఎంపీపీ భగవాన్ నాయక్, నల్లగొండ జడ్పీటీసీ వంగూరి లక్ష్మయ్య జిల్లా జైలు సూపరింటెండెంట్ కేతవత్ దేవ్లా, గిరిజన ఉద్యోగ సంఘం అధ్యక్షులు జగన్‌సింగ్, స్థానిక కౌన్సిలర్ ప్రదీప్‌నాయక్, వివిధ శాఖల అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, గిరిజన నాయకులు, గిరిజనులు పాల్గొన్నారు.

## ముమ్మరంగా సాగుతున్న దరఖాస్తుల విచారణ

- 48 టీంలు...12,436 దరఖాస్తులు

**నవతెలంగాణ-మిర్యాలగూడ**



మిర్యాలగూడ పట్టణంలో ఇండస్ట్రియల్ ఏరియాలో నిర్మించిన డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల పంపిణీలో భాగంగా స్వీకరించిన దరఖాస్తులపై రెవెన్యూ అధికారులు విచారణ ప్రారంభించారు. ఐదు రోజులపాటు సాగిన దరఖాస్తుల స్వీకరణలో 48 వార్డులకుగాను 12,436 దరఖాస్తులు వచ్చాయి. వీటిని క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపేందుకు పంచాయతీరాజ్ అధికారులను నియమించారు. వార్డుకు ఒక బృందం చొప్పున 48 బృందాలను ఏర్పాటు చేశారు. ఇందులో ఇద్దరు పంచాయతీ కార్యదర్శులు, అంగన్వాడీ టీచర్, ఇద్దరు రిసోర్స్ పర్సన్‌లు మొత్తం ఐదుగురిని బృందంగా నియమించారు. 9 వార్డులకు మండల పంచాయితీ అధికారి పర్యవేక్షించనున్నారు. శుక్రవారం పట్టణంలోని అన్ని వార్డులలో అధికారులు దరఖాస్తులపై విచారణ చేపట్టారు. సీతారాంపురంలో విచారణ బృందం ఇంటింటికి తిరిగి క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ బిక్షం రాజు, డిప్యూటీ తహసీల్దార్ సైదులు, పంచాయతీ కార్యదర్శులు ఎస్‌కే. జాఫర్, జూనియర్ పంచాయితీ కార్యదర్శి కందిమల్ల నరేందర్‌రెడ్డి, అంగన్వాడీ టీచర్లు విజయ, మెహరాజున్నిసా, ఆర్పీలు శశికళ, శకుంతుల, ఇందిరా, మెరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## రోగులకు మెరుగైన వైద్య సేవలందించాలి



**నవతెలంగాణ-మిర్యాలగూడ**

ప్రజలకు వైద్య సేవలు అందించడంలో ప్రభుత్వ ఆరోగ్య సిబ్బంది నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవని రాష్ట్ర వైద్య విధాన పరిషత్ కమిషనర్ డాక్టర్ అజయ్‌కుమార్ హెచ్చరించారు. శుక్రవారం మిర్యాలగూడ పట్టణంలోని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిని ఆకస్మికంగా తనిఖీ చేసి వార్డులో పర్యటించారు. రోగుల కేస్ షీట్‌లు పరిశీలించి ఆస్పత్రిలో అందిస్తున్న వైద్య సేవలు అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రి పరిశుభ్రత, వైద్యులు, నర్సుల పని తీరు పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు. పని తీరు మార్చు కోకుంటే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. డ్యూటీ వైద్యులు సిబ్బంది రోగులకు అందుబాటులో ఉండి మెరుగైన చికిత్స అందించాలని కోరారు. ఆసుపత్రికి వచ్చే రోగులకు ఎట్టి పరిస్థితుల్లో బయట మందులు రాయొద్దని, మందుల కొరత ఉంటే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లాలన్నారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మిర్యాలగూడ ఆస్పత్రిని మరో వంద పడకలు అప్ గ్రేడ్ చేస్తున్నామని, ఇందుకు రూ. 14కోట్లు మంజూరు అయినట్లు పేర్కొన్నారు. త్వరలో పనులకు టెండర్ పిలుస్తామని చెప్పారు. సిబ్బంది కొరత అధిగమించేందుకు రాష్ట్ర వ్యాప్తంగా 5వేల నర్సింగ్ పోస్టులు భర్తీ చేస్తున్నట్లు తెలిపారు. ఆస్పత్రి మార్చురీకి మూడు డెడ్ బాడీలు స్టోర్ చేసే ఫ్రీజర్ అందుబాటులోకి వస్తుందన్నారు. రోగులకు నాణ్యమైన బాధ్యతాయూతమైన సేవలు అందించేలా బయో మెట్రిక్ విధానం అమలు చేస్తామన్నారు. ఇతర అభివృద్ధి పనులను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తామన్నారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ శ్రీనివాస్ సమరద్, డాక్టర్లు పుల్లారావు, రాంబాబు, శ్రీకాంత్ సిబ్బంది వేణు, యునస్, అలీ తదితరులు పాల్గొన్నారు.



## కార్మికునికి ఆర్థిక సాయం అందజేత

**నవతెలంగాణ-మిర్యాలగూడ**

రోడ్డు ప్రమాదంలో గాయపడిన పెయింటర్. ధర్మవరపు శ్రీనుకు శుక్రవారం ఆర్థిక సాయం అందజేశారు. పెయింటింగ్ వర్కర్స్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో రూ.3,500, 50 కేజీల బియ్యం అందజేశారు. ఆపదలో ఉన్న కార్మికులను సంఘం ఆదుకుంటుందని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి డాక్టర్ మల్లు గౌతమ్‌రెడ్డి తెలిపారు. కార్మికులు హక్కుల సాధనకు బలమైన పోరాటాలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సంఘం ఉపాధ్యక్షులు బీఎం నాయుడు, పెయింటింగ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు మంద రాజు, కార్యదర్శి ఎస్పీ.సైదులు, కోశాధికారి పాశం గోవర్ధన్‌రెడ్డి, బుజ్జిబాబు, ఉపాధ్యక్షులు నాగులుమీరా, సురేందర్, ఎండీ.గౌస్, కురిమేటి సోములు, కోటి, అంగరాజు, రాంబాబు, బాబు, యుగంధర్, మాతంగి శ్రవణ్, నాగేందర్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

## 'గ్రామీణ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు'

**నవతెలంగాణ-కట్టంగూరు**



గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని ఎంపీ బడుగుల లింగయ్యయాదవ్, ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కోటి 56 లక్షల రూపాయల 15వ ఆర్థిక సంఘం నిధులతో నిర్మించనున్న భవనానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. దేశంలోనే తెలంగాణ రాష్ట్రంలో ఆరోగ్య రంగంలో మెరుగైన వసతులు కల్పిస్తుందని, ఆరోగ్యశాఖ మంత్రి హరీష్ రావు నేతృత్వంలో దేశంలోనే వైద్యరంగంలో తెలంగాణ మూడవ స్థానంలో నిలిచిందని నీతి ఆయోగ్ పేర్కొన్నట్లు తెలిపారు. ముఖ్యమంత్రి కేసీఆర్ కృషి వల్ల రాష్ట్రంలోని ప్రతి జిల్లాకు మెడికల్ కాలేజీలను ప్రారంభించారని, ప్రతి లక్ష జనాభాకు 19 ఎంబీబీఎస్ సీట్లు, ఏడు పిజి సీట్లుతో తెలంగాణ దేశంలో రెండో స్థానంలో నిలిచిందని చెప్పారు. నియోజకవర్గంలో 12 సబ్ సెంటర్లలో 2.40 కోట్లతో నూతన భవనాలను నిర్మించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ తరాల బలరాములు, పీఏసీఎస్ చైర్మెన్ నూక సైదులు, వైస్ ఎంపీపీ గడుసు కోటిరెడ్డి, నకిరేకల్ మార్కెట్ వైస్ చైర్మెన్ పోగుల నర్సింహ్మా, డిప్యూటీ డీఎంహెచ్‌వో వేణుగోపాల్ రెడ్డి, వైద్యాధికారి శ్వేత, తహసిల్దార్ దేశ్యానాయక్, బీఆర్ఎస్ మండల అధ్యక్షులు ఊట్కూరి ఏడుకొండలు, సర్పంచులు, ఎంపీటీసీలు, వివిధ శాఖల అధికారులు, కాంట్రాక్టర్ కక్కిరేణి వెంకటేశ్వర్లు ఉన్నారు.

## లక్ష్యాలను పూర్తి చేసేలా ప్రత్యేక కార్యాచరణ అమలు చేయాలి

- పోడు భూముల పట్టా పాస్ పుస్తకాల ముద్రించి పంపిణీ సన్నద్ధం కావాలి
- రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి

**నవతెలంగాణ-నల్లగొండ కలెక్టరేట్**



ప్రభుత్వ లక్ష్యాలను త్వరితగతిన పూర్తి చేసేలా అధికారులు ప్రత్యేక కార్యాచరణ అమలు చేయాలని, యుద్ధప్రాతిపదికన పని చేసి సకాలంలో పనులు పూర్తి కావాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి అన్నారు. శుక్రవారం హైదరాబాద్ నుండి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి పుర పాలన పట్టణ అభివృద్ధిశాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ అరవింద్ కుమార్, రాష్ట్ర స్థాయి ఉన్నత అధికారులతో కలిసి కంటి వెలుగు, పట్టణ ప్రాంతాలలో రెండు పడక గదుల నిర్మాణం, 58, 59, 76 ప్రభుత్వ జీఓల ప్రకారం చేయవలసిన క్రమబద్ధీకరణ, పోడు భూములు, ఆయిల్ పామ్ సాగుపై జిల్లా కలెక్టర్ లతో వీడియో సమావేశం నిర్వహించి సమీక్షించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మాట్లాడారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ టీ.వినయ్ కృష్ణారెడ్డి, అదనపు కలెక్టర్లు ఖుష్బు గుప్తా, భాస్కర్‌రావు, డీఎఫ్ఓ భాస్కర్‌రావు, జిల్లా ఉద్యానవనాధికారి సంగీత లక్ష్మి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కొండల్ రావు, తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధి హామీ పనులను ఉపయోగించుకోవాలి

**నవతెలంగాణ-తిరుమలగిరిసాగర్**



అర్హత, జాబ్ కార్డ్ ఉన్న ప్రతి ఒక్కరూ ఉపాధి హామీ పనులను ఉపయోగించుకోవాలని ఎంపీడీఓ అస్గర్ అలి అన్నారు. శుక్రవారం మండలంలోని శీతల తండా, సిల్గాపురం, కిచ్చ తండా, గరికినేటి తండా గ్రామాలలో ఉపాధి హామీ పనులు చేయడానికి లేబర్‌ను మొబలైజ్ చేశారు. కీచ్యా తండా, శిల్గాపురం గ్రామంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను, మస్టర్లను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన పనిచేస్తున్న కూలీలతో మాట్లాడుతూ గ్రామంలో ఉన్న ప్రతి ఒక్కరు ఉపాధి హామీ పనులను ఉపయోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ పద్మ, టెక్నికల్ అసిస్టెంట్లు కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు, కూలీలు పాల్గొన్నారు.

## 'ప్రతి ఒక్కరూ మల్లన్న స్వామి అనుగ్రహం పొందాలి'

- ఎమ్మెల్యే రవీంద్ర కుమార్

**నవతెలంగాణ-చింతపల్లి**



ప్రతీ ఒక్కరూ మల్లన్న స్వామి అనుగ్రహం పొందాలని దేవరకొండ శాసన సభ్యులు, బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు రమావత్ రవీంద్రకుమార్ అన్నారు. శుక్రవారం చింతపల్లి మండలం నేల్వలపల్లి గ్రామంలో మల్లన్న స్వామి దేవాలయంలో ఎమ్మెల్యే పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ....దైవ చింతనతో మానసిక ప్రశాంతత లభిస్తుందని తెలిపారు. జాతరలో ప్రత్యేక ఆకర్షణగా దేవరకొండ శాసనసభ్యులు రమావత్ రవీంద్రకుమార్, సర్పంచ్ల ఫోరం అధ్యక్షుడు గున్‌రెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, గుర్రాల మీద ఎక్కి స్వారీ చేయడం అందరిని ఆకర్షించింది. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు కంకణాల వెంకట్‌రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు దొంతం చంద్రశేఖర్‌రెడ్డి, మండల సర్పంచుల ఫోరం అధ్యక్షులు గున్‌రెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, రైతు బంధు అధ్యక్షుడు ఉజ్జిని విద్యాసాగర్‌రావు, యాదాద్రి ఎన్రా చైర్మెన్ ముచ్చర్ల శ్రీకాంత్‌యాదవ్, సుమతిరెడ్డి, కుంభం శ్రీశైలంగౌడ్, బురుగు రవి, అక్రమ్‌యాదవ్, మాల్లోజు జగన్, బాదేపల్లి నిరంజన్, తదితరులు పాల్గొన్నారు.

## ప్రీతి మృతికి కారణమైన వారిని వెంటనే ఉరి తీయాలి

**ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు సక్రు నాయక్**

**నవతెలంగాణ-పెద్దవూర**



వరంగల్‌లో కాకతీయ మెడికల్ కళాశాల అనస్తీసియా వైద్య విభాగం జూనియర్ పీజీ విద్యార్థిని ధరావత్ ప్రీతి మృతికి కారణమైన నిందితుడు మహ్మద్ సైఫ్‌ను వెంటనే ఉరితీయాలని లంబాడ హక్కుల పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షులు రమావత్ సక్రునాయక్ ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. శుక్రవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ రాష్ట్రంలో గిరిజనులపై అత్యాచారం రోజు రోజుకి పెరుగుతున్నాయే తప్ప తగ్గడం లేదన్నారు. రాష్ట్రంలో మహిళలు విద్యార్థినిలు ఎక్కడ తిరిగలేని స్వేచ్ఛ స్వతంత్రం లేకుండా పోయిందని విమర్శించారు. నిదితునికి కఠిన శిక్ష విధించాలని కోరారు. లేనిపక్షంలో గిరిజన సంఘాల ఆధ్వర్యంలో ధర్నాలు రాస్తారోకోలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ విలేకరుల సమావేశంలో గిరిజన సంఘం రాష్ట్ర నాయకులు మేరావత్ మునినాయక్, లంబాడ హక్కుల పోరాట సమితి నియోజకవర్గ అధ్యక్షులు నాగేశ్వరరావునాయక్, సపావత్ శ్రీనునాయక్, రవి నాయక్, దస్రు నాయక్, పాండునాయక్, నాగనాయక్, వాలానాయక్, శ్రీను నాయక్, బాబు నాయక్, జై లాల్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## సీసీ కెమెరాలతో భద్రత

- డీఎస్పీ వెంకటగిరి

**నవతెలంగాణ-మిర్యాలగూడ**



సీసీ కెమెరాల ఏర్పాటు వల్ల పూర్తి భద్రత, రక్షణ పొందవచ్చు అని మిర్యాలగూడ డీఎస్పీ వెంకటగిరి అన్నారు. మిర్యాలగూడ వన్ టౌన్ పోలీసుల సూచన మేరకు కమ్యూనిటీ పోలీసింగ్‌లో భాగంగా శుక్రవారం హౌసింగ్ బోర్డ్ కాలనీలో ఏర్పాటు చేసిన 9 సీసీ కెమెరాలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. నిఘా నేత్రాల ఏర్పాటు ద్వారా నేరాలు, ప్రమాదాలు నివారించవచ్చు అని పేర్కొన్నారు. కాలనీలో సీసీ కెమెరాలు ఉండడం వలన దొంగలు, ఇతర అవాంచిత సంఘటనలు చేసేవారు భయపడి చేయడం ఆపివేస్తారు. మిర్యాలగూడ పట్టణం పరిధిలోని కాలనీలో కాలనీవాసులు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీఐ రాఘవేంద్ర, ఎస్సై సుధీర్, కాలనీ పెద్దలు రిటైర్డ్ వీఆర్ఓ వెంకటరమణ, మంద సైదులు, వాడపల్లి మాజీ సర్పంచ్ గుప్త, దశరథ రామయ్య, రాంరెడ్డి, వెంకట్‌రెడ్డి, వేణుగోపాల్ రావు, అశోక్, శ్రీనివాస్, రామారావు తదితరులు పాల్గొన్నారు.

## ఆపదలో ఉన్న వారికి అండగా ఉంటాం



**నవతెలంగాణ-కొండమల్లేపల్లి**

పేద ప్రజలకు ఏ ఆపద వచ్చిన వారికి తమవంతు సాయం అందించి వారికి అండగా ఉంటామని కొండమల్లేపల్లి ఎంపీపీ దూదిపాల రేఖ శ్రీధర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం కొండమల్లేపల్లి మండల పరిధిలోని చింతకుంట్ల గ్రామంలో గ్రామానికి చెందిన పంది వెంకటయ్య లక్ష్మణ్‌ల కుమార్తె పల్లవికి గత కొన్ని రోజుల క్రితం అపెండెక్స్ నొప్పి రావడంతో ఈ విషయాన్ని కుటుంబ సభ్యులు ఎంపీపీ దృష్టికి తీసుకువెళ్లగా వెంటనే ఎంపీపీ స్పందించి తన సొంత ఖర్చులతో పాపకు అపెండెక్స్ ఆపరేషన్ చేయించి పెద్దమనసు చాటుకున్నారు. శుక్రవారం పాప నివాసానికి వెళ్లి పాప ఆరోగ్య విషయాన్ని అడిగి తెలుసుకున్నారు. ఏదైనా అవసరం ఉంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. వీరి వెంట ఉపసర్పంచ్ ఏకుల సురేష్ తదితరులున్నారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులు ఎంపీపీకి కృతజ్ఞతలు తెలిపి ఎల్లప్పుడు మీకు రుణపడి ఉంటామన్నారు.

## 'గోదాం అగ్ని ప్రమాదంలో రాజకీయ కుట్ర'

**నవతెలంగాణ-కేతపల్లి**



కేతేపల్లి మండలంలోని ఇప్పలగూడెం గ్రామ శివారులోని గోదాంలో ఈనెల 22న జరిగిన అగ్ని ప్రమాదంలో రాజకీయ కుట్ర దాగి ఉందని, గోదాముల్లో నిల్వ ఉంచిన గన్ని బ్యాగ్స్ మాయం చేసి కావాలనే అగ్నిప్రమాదం చేసినట్లు టీపీసీసీ రాష్ట్ర కార్యనిర్వక కార్యదర్శి దైద రవీందర్ అనుమానం వ్యక్తం చేశారు. శుక్రవారం కేతేపల్లిలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. గుడివాడ - ఇప్పలగూడెం నిల్వ ఉన్న గన్ని బ్యాగ్స్ కాలి పోయిన ఘటలో రాజకీయ కుట్ర ఉన్నట్లు, కొత్త బస్తాల బెల్స్ మాయం చేసి కావాలనే కొన్ని బస్తాలకు నిప్పు పెట్టినట్టు కాంగ్రెస్ పార్టీ అనుమానం వ్యక్తం చేస్తుందని, రైతులకు , ప్రజలకు ఉన్న అనుమానాలు నివృత్తం చేయాలని డిమాండ్ చేశారు. ఇంత పెద్ద అగ్నిప్రమాదం జరిగితే స్థానిక ఎమ్మెల్యే కానీ, బీఆర్ఎస్ పార్టీ ప్రజా ప్రతినిధులు కానీ సందర్శించకపోవటంలో మతలబు ఏమిటని ప్రశ్నించారు. పోలీసులు మా అనుమానాల పై సునిశితంగా దర్యాప్తు చేసి నిందితులను పట్టుకొని కఠినంగా శిక్షించాలని నకిరేకల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ పక్షాన డిమాండ్ చేస్తున్నామన్నారు. ఈ సమావేశంలో కేతేపల్లి పీఏసీఎస్ చైర్మెన్ బోళ్ల వెంకట్‌రెడ్డి, ఎంపీపీ పెరుమాళ్ళ శేఖర్, కాంగ్రెస్ పార్టీ కేతేపల్లి మండల అధ్యక్షుడు కంపసాటి శ్రీనివాస్‌యాదవ్, మాజీ సింగిల్ విండో చైర్మెన్ గార్లపాటి రవీందర్‌రెడ్డి, కప్పల సైదులు, యూత్ కాంగ్రెస్ నకిరేకల్ నియోజకవర్గ అధ్యక్షుడు ముద్దం విజయ్, ఎండీ. యూసుఫ్, చెనగోని రాజశేఖర్‌గౌడ్, పందిరి సతీష్ పాల్గొన్నారు.

## మున్సిపల్ కాంప్లెక్స్‌లోని 6షాపులు సీజ్

- సుమారు 15 లక్షలు అద్దె బకాయిలు

**నవతెలంగాణ-మిర్యాలగూడ**



మిర్యాలగూడ పట్టణంలోని ఎన్టీఆర్ మున్సిపల్ కాంప్లెక్స్‌లో అద్దెలు చెల్లించని ఆరు షాపులను శుక్రవారం మున్సిపల్ అధికారులు సీజ్ చేశారు. మున్సిపల్ కమిషనర్ రవీంద్ర సాగర్ ఆదేశానుసారం రెవెన్యూ అధికారి కళ్యాణి ఆధ్వర్యంలో కాంప్లెక్స్‌లోని మూడు, నాలుగు, 15, 23, 45, 78 షాపులను సీజ్ చేశారు. అద్దెలు చెల్లించాలని పలుమార్లు నోటీసులు జారీ చేసిన దుకాణదారులు స్పందించకపోవడంతో షాపులను సీజ్ చేసినట్టు కళ్యాణి తెలిపారు. ఈ ఆరు షాపులగాను సుమారు 15 లక్షలు అద్దెలు బకాయిలు ఉన్నట్టు తెలిపారు.

## అంబులెన్స్ సర్వీస్ ప్రారంభించిన ఎమ్మెల్యే చిరుమర్తి

**నవతెలంగాణ-చిట్యాలటౌన్**



చిట్యాల పట్టణంలో యశోద హాస్పిటల్ వారు హైదరాబాద్ విజయవాడ హైవేపై గుండ్రాంపల్లి, కట్టంగూర్ వద్ద ఏర్పాటు చేయనున్న ఉచిత అంబులెన్స్ సర్వీస్‌ను నకిరేకల్ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రమాదాలు అయినా, హార్ట్ ఎటాక్ వంటి అనుకోని ప్రమాదాలు జరిగినప్పుడు బాధితులను వెంటనే దగ్గరలోని ఆస్పత్రికి తరలించే విధంగా ఈ ఉచిత అంబులెన్స్ సర్వీస్‌ను అందుబాటులోకి తీసుకురావడం అభినందనీయమన్నారు. రోడ్డు ప్రమాదంలో గాయపడిన వారిని సకాలంలో దగ్గరలోని ఆస్పత్రికి తరలించేందుకు పూర్తి ఉచితంగా అంబులెన్స్ సర్వీస్‌ను అందుబాటులోకి తీసుకురావడం అభినందనియమన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మెన్ కొమటిరెడ్డి చినవెంకటరెడ్డి, సీఐ శివరాంరెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మెన్ లింగస్వామి, ఆర్యవైశ్య జిల్లా అధ్యక్షులు వనమా వెంకటేశ్వర్లు, పలువురు కౌన్సిలర్లు పాల్గొన్నారు.

## ఆరోగ్య మిత్రల సమస్యలను పరిష్కరించాలి

**నవతెలంగాణ-మర్రిగూడ**

ఆరోగ్య శ్రీ పథకంలో పనిచేస్తున్న ఆరోగ్య మిత్రల సమస్యలు పరిష్కరించాలని ఆరోగ్య మిత్రల సంఘం రాష్ట్ర అధ్యక్షులు గిరి యాదయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి హరీష్‌రావు ప్రత్యేక చొరవ తీసుకొని గత 15 సంవత్సరాలుగా ఔట్సోర్సింగ్ విధానంలో పనిచేస్తున్న ఆరోగ్య మిత్రాలకు వారి హోదాకు తగ్గట్టుగా సరియైన క్యాడర్ సదుపాయం కల్పించి, ఉద్యోగ భద్రత, కనీస వేతనం అమలుచేసి ఆర్థికంగా వారి కుటుంబాలను ఆదుకోవాలని పేర్కొన్నారు. ప్రస్తుతం ఆరోగ్యశ్రీతో పాటు అదనంగా ఈహెచ్‌ఎస్, ఆయుష్మాన్ భారత్, ఈ కేవైసీ తదితర పనులు కూడా ఆరోగ్య మిత్రులతోనే చేయించుకుంటున్నారని వారి పనికి తగ్గ వేతన సదుపాయం కల్పించాలని కోరారు.

## నిర్మాణ పనులు పరిశీలన

**నవతెలంగాణ-నార్కట్‌పల్లి**



మండల పరిధిలోని బ్రాహ్మణ వెల్లంల గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో నూతనంగా నిర్మిస్తున్న పాఠశాల భవనాన్ని శుక్రవారం నార్కట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు బత్తుల ఉషయ్య పరిశీలించారు. ఈ కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ నాయకులు బొడిగె, స్వామి, మోదుగు శేఖర్‌రెడ్డి, కొంపెల్లి సైదులు, బింగి శ్రీనివాస్, చిరుమర్తి ఉపేందర్, సోమనబోయిన స్వామి, సోను బోయిన మధు, చిరుమర్తి రవి, సోమనబోయిన మధు, విశ్వనాధుల గణేష్, బొప్పని జాని తదితరులు పాల్గొన్నారు.

## బుద్ధవనం ఒక బౌద్ధ ప్రపంచం

**నవతెలంగాణ-నాగార్జునసాగర్**



బుద్ధవనం ఒక బౌద్ధ ప్రపంచం అని ఇక్కడ గడిపిన ప్రతిక్షణం తనకు ప్రశాంతతను, హాయ్‌ని ఇచ్చిందని, సమాజం ఎదుర్కొంటున్న సమస్యలకు బుద్ధుని బోధనలే శరణమని తమిళనాడు ఎంపీ డాక్టర్ తొల్కాప్పియన్ తిరుమావల్వన్ అన్నారు. శుక్రవారం బుద్ధవనాన్ని సందర్శించిన ఆయనకు బుద్ధవనం ప్రత్యేక అధికారి మల్లెపల్లి లక్ష్మయ్య ఆదేశాల మేరకు బుద్ధవనం సిబ్బంది ఆయనకు ఘన స్వాగతం పలికారు. బుద్ధవనంను తాను మల్లెపల్లి లక్ష్మయ్య ఆహ్వానం మేరకు సందర్శించానని, బుద్ధుని జీవిత గాథలు జాతక కథలు రూపవనం బుద్ధ చరిత వనం ప్రత్యేకించి మహాస్థూపం తనకి ఎంతగానో ఆకట్టుకున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్.నరసింహరావు, విష్ణు, బుధవన సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## 'ఎమ్మెల్యే వ్యాఖ్యలు సరికావు'

**నవతెలంగాణ-మిర్యాలగూడ**

ఎన్ఎస్‌పీ క్యాంపు గ్రౌండ్‌లో జరిగిన దళిత బంధు పంపిణీలో కులాల ప్రస్తావనతో ఎమ్మెల్యే భాస్కర్‌రావు మాట్లాడడం సరైన పద్ధతి కాదని పట్టణ నాయి బ్రాహ్మణ సేవా సంఘం కమిటీ, రజక సేవా సంఘం కమిటీ సభ్యులు అన్నారు. శుక్రవారం ఆ సంఘాల ఆధ్వర్యంలో స్థానికంగా నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. ఎమ్మెల్యే భాస్కరరావు ఒక కార్యక్రమంలో సాకలి, మంగలి కులాల వారు చేయరాని పనులు చేస్తున్నట్టు, వారు చేసే పనులు నేను చేయాలా అని మాట్లాడడం ప్రజా ప్రతినిధిగా ఆయనకు తగదన్నారు. ఈ విషయమై ఎమ్మెల్యే భాస్కరరావు నాయి బ్రాహ్మణ సంఘానికి బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాయించి నరసింహ, నాగభూషణం, గానపాటి రవి, పగిళ్ల కళ్యాణ్, నరసింహ, సతీష్, యాదగిరి, సైదులు, లక్ష్మణ్, వెంకన్న, విష్ణు, చిన్న సైదులు, తదితర నాయి బ్రాహ్మణ, రజక సంఘ సభ్యులు పాల్గొన్నారు.

## కెనరా బ్యాంకు కారు లోను మేళా



**నవతెలంగాణ-చిట్యాలటౌన్**

చిట్యాల కెనరా బ్యాంకు ఆధ్వర్యంలో శుక్రవారం కార్ లోన్ మేళా నిర్వహించారు. కార్ లోన్ మేళ శిబిరాన్ని కెనరా బ్యాంక్ డీఎం సాయి ప్రకాష్ ప్రారంభించి మాట్లాడారు. మేళాలో టాటా హుండాయ్ మారుతి, కియా కంపెనీలకు చెందిన షోరూం నిర్వాహకులు వాహనాలకు ఇచ్చే రుణ వివరాలను వివరించారు. తమ బ్యాంకు ద్వారా రుణాలను తక్కువ వడ్డీ రేట్లకే మంజూరు చేస్తామని, సరైన పత్రాలు ఉన్నట్లయితే ఖాతాదారులకు సత్వరమే రుణాలను అందజేస్తామని తెలిపారు. విద్య, వ్యాపారం, గృహ, బంగారు ఆభరణాలపై తక్కువ వడ్డీరేట్లకు కోట్లాది రూపాయల రుణాలను ఇప్పటికే మంజూరు చేశామని చెప్పారు. ఈ కార్యక్రమంలో చిట్యాల బ్యాంక్ మేనేజర్ వేమిరెడ్డి వరుణ్ కుమార్‌రెడ్డి, సుష్మ, చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

## ఎస్‌టీఓకి వినతి

**నవతెలంగాణ-మర్రిగూడ**

టీఎస్ యూటీఎఫ్ నాంపల్లి, మర్రిగూడ మండల శాఖల ఆధ్వర్యంలో శుక్రవారం నాంపల్లి సబ్ ట్రెజరీ కార్యాలయంలో సబ్ ట్రెజరరీ ఆఫీసర్ ఐడీ.ప్రసన్న కుమార్‌కు పీఆర్సి, డీఏ ఏరియర్స్ ఖాతాలో జమ ఐన బిల్లులకు మాత్రమే ఐటీ చూపించాలని, ఈ- కుబేర్ పెండింగ్‌లో ఉన్న బిల్లులకు చూపించవలసిన అవసరం లేదని, నాంపల్లి ఉప కోశాధికారి పరిధిలో ఉన్న మండలాల ఉపాధ్యాయుల బిల్లుల సకాలంలో తీసుకొని ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని కోరుతూ వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో టీఎస్ యూటీఎఫ్ జిల్లా కార్యదర్శులు గేర నర్సింహ, కే.కృష్ణారెడ్డి, నాంపల్లి మండల అధ్యక్షులు,ఎస్. నారాయణ, మర్రిగూడ మండల కమిటీ సభ్యులు కే. శ్రీనయ్య, బీ.వెంకటేష్ పాల్గొన్నారు.

## ఎన్‌సీడీ కిట్స్ పంపిణీ

**నవతెలంగాణ-నార్కట్‌పల్లి**



తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ఎన్‌సీడీ మందుల కిట్స్‌ను మండల పరిధిలోని బాజకుంట్ల గ్రామంలో శుక్రవారం గ్రామ సర్పంచ్ ఈదునూరి సరిత రవీందర్‌రెడ్డి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అందరినీ ఆరోగ్యంగా ఉంచాలనే ఉద్దేశంతోనే తెలంగాణ ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లో వైద్య రంగాన్ని మెరుగుపరుస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలోఆరోగ్య సిబ్బంది ఉన్నారు.



## మునగాల తహసీల్దార్‌గా జవహర్‌లాల్

**నవతెలంగాణ-మునగాల**

మండల తహసీల్దారుగా బాణోత్ జవహర్‌లాల్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు.ఆయన నడిగూడెం మండలంలో డిప్యూటీ తహసీల్దార్‌గా పనిచేస్తున్నారు.ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఇన్‌చార్జి తహసీల్దార్‌గా నియ మితులయ్యారు. గతంలో ఇక్కడ తహసీల్దార్‌గా విధులు నిర్వహించిన కృష్ణానాయక్ మేడ్చల్‌కు బదిలీ అయ్యారు. మండల రెవెన్యూ పరిధిలో భూ సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని తెలిపారు.అన్ని గ్రామాల ప్రజాప్రతినిధులు సహ కరించాలని కోరారు.



## కల్లుగీత కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శిగా మడ్డి అంజిబాబు

**నవతెలంగాణ-పెన్‌పహాడ్**

తెలంగాణ కల్లు గీత కార్మిక సంఘం జిల్లా ప్రధానకార్యదర్శిగా మండలంలోని చీదేళ్ల గ్రామానికి చెందిన మడ్డి అంజిబాబు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.శుక్రవారం మండలకేంద్రంలో జరిగిన ఆ సంఘం జిల్లా స్థాయి సమావేశంలో ఈ ఎన్నిక జరిగినట్లు గీత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ఎంవీ రమణ. బెల్లంకొండ వెంకటేశ్వర్లు ప్రకటించారు.ఈ సందర్భంగా అంజిబాబు మాట్లాడుతూ గీత కార్మికుల సమస్యల పరిష్కారం కోసం అహర్నిశలు కృషి చేస్తూ సంఘం బలోపేతం కోసం కృషి చేస్తానన్నారు.



## నట్టల నివారణా మందులను సద్వినియోగం చేసుకోవాలి

**జిల్లా పశువైద్యాధికారి డాక్టర్ శ్రీనివాసరావు**

**నవతెలంగాణ-తుంగతుర్తి**

గొర్రెల,మేకల నట్టలనివారణా మందులను పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా పశువైద్యాధికారి డాక్టర్ శ్రీనివాసరావు అన్నారు.శుక్రవారం మండలపరిధిలోని కొత్తగూడెంలో ఏర్పాటు చేసిన నట్టల నివారణ మందుల పంపిణీ కార్యక్రమాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి మాట్లాడారు.ఈ మేరకు ప్రతి మూడు నెలలకోసారి గొర్రెలు,మేకలకు నట్టల నివారణామందులు తాగించినట్టయితే నట్టలు పడిపోయి,జీవాలు బలంగా తయారై ఆరోగ్యంగా ఉంటాయన్నారు.ఎన్‌ఎల్‌ఎం సబ్సిడీని గొర్రెల, మేకలపెంపకందారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.ఈ సందర్భంగా గ్రామంలోని 3212 గొర్రెలకు,281 మేకలకు నట్టల నివారణా మందు తాపించామన్నారు.ఈ కార్యక్రమంలో ఏడీఏ డాక్టర్ భయగాని రవిప్రసాద్‌గౌడ్, మండల పశువైద్యాధికారి డాక్టర్ నరేష్, వెటర్నరీ అసిస్టెంట్ రవి, ప్రవీణ్,హరిప్రసాద్ రైతులు తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర స్థాయి సెమినార్‌ను జయప్రదం చేయండి

**నవతెలంగాణ-సూర్యాపేట**

ఈనెల 27, 28వ తేదీల్లో జనగామలో జరిగే కేవీపీఎస్ రాష్ట్ర సమావేశాల సందర్భంగా 'మనువాదం-రాజ్యాంగం' అనే అంశంపై 27వ తేదీన జనగామ జిల్లా కేంద్రంలో జరుగుతున్న రాష్ట్రస్థాయి సెమినార్‌ను జయప్రదం చేయాలని ఆ సంఘం జిల్లా ప్రధానకార్యదర్శి కోటగోపి పిలుపునిచ్చారు. కేవీపీఎస్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక శ్రీ లక్ష్మీగార్డెన్‌లో ఆయన సెమినార్‌కు సంబంధించిన కరపత్రాలను విడుదల చేసి మాట్లాడారు.కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం అంబేద్కర్ రచించిన రాజ్యాంగాన్ని మార్చి మనువాదాన్ని అమలు చేయాలని చూస్తుందన్నారు. మనుషుల మధ్య అసమానతలు సృష్టించే మనువాదాన్ని దేశం నుండి ప్రారలోలాలన్నారు. దేశంలో నివసించే అన్ని వర్గాల ప్రజలకు రక్షణగా ఉన్న భారత రాజ్యాంగాన్ని కాపాడుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు.ఈ సందర్భంలో జరుగు మనువాదం రాజ్యాంగం రాష్ట్రస్థాయి సెమినార్‌లో దళితులు, అభ్యుదయ వాదులు, మేధావులు అధికసంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.సెమినార్‌కు ముఖ్యఅతిథులుగా ఉస్మానియా యూనివర్సిటీ తెలుగు అకాడమీ అధ్యక్షులు ప్రొఫెసర్ ఖాశీం,కేవీపీఎస్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు జాన్‌వెస్లీ, టీ. స్కైలాబ్‌బాబు హాజరవుతున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు మర్రి నాగేశ్వరరావు, జిల్లా ఉపాధ్యక్షులు నందిగామ సైదులు, జిల్లా సహాయ కార్యదర్శి దేవరకొండ యాదగిరి, జిల్లా నాయకులు అబ్రహం,సూరి, ఏసు, ఉప్పెల్లి వెంకటేశ్వర్లు,దేవానందం తదితరులు పాల్గొన్నారు.

## పదో తరగతి విద్యార్థులకు ఉచిత టాలెంట్ టెస్ట్

**నవతెలంగాణ-ఆత్మకూరుఎస్**

మండలంలోని ఆత్మకూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ఆత్మకూరు గురుకుల పాఠశాల, ఏనుభముల ఉన్నత పాఠశాల, నెమ్మికల్ ఉన్నత పాఠశాల,ఏపూరు ఉన్నత పాఠశాల, మిడతనపల్లి ఉన్నత పాఠశాలలలో పదవ తరగతి చదువుతున్న విద్యార్థులకు ఆలిండియా స్టూడెంట్ ఫెడరేషన్ వారి ఆధ్వర్యంలో ఉచిత టాలెంట్ టెస్ట్‌ను నిర్వహించడం నిర్వహించారు. అనంతరం విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసు కున్నారు.వారితో కలిసి భోజనం చేశారు.ఈ కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు గోపగాని రవికుమార్‌గౌడ్, ఏఐఎస్ఎఫ్ సూర్యాపేట పట్టణ నాయకులు, మాదాసు మహేష్, కన్నపర్తి యశ్వంత్, కే.సంపత్, ఏ.నవీన్, ఎం.రాజు పాల్గొన్నారు.



## ఆయిల్‌ఫామ్ సాగుకు ముందుకు రావాలి

**నవతెలంగాణ-మునగాల**

నమ్మకమైన నీటి వసతి కలిగిన భూముల్లో ఆయిల్‌ఫామ్ సాగు చేసేందుకు రైతులు ముందుకు రావాలని మండల వ్యవసాయ అధికారి బాణోత్ అనిల్‌కుమార్ తెలిపారు.శుక్రవారం రేపాలలో ఆయిల్‌ఫామ్ సాగు పట్ల రైతులకు అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎర్ర ఇసుక, నల్లరేగడి భూములు బిందు సేద్యానికి అనుకూలంగా వుంటాయని చెప్పారు.2 అడుగుల లోతు, 2అడుగుల వెడల్పు గుంతలు తవ్వి ఎకరానికి 57 మొక్కలు నాటాలని సూచించారు.నాటిన నాలుగేండ్ల అనంతరం మొక్కలు కాపుకొస్తాయని చెప్పారు.ఒక్కసారి మొక్కలు నాటితే 25నుంచి30 ఏండ్ల వరకు ఎకరానికి 8 నుంచి12 టన్నుల దిగుబడి వస్తుందని తెలిపారు.ఆయిల్‌ఫామ్‌ను ప్రభుత్వం ప్రోత్సహిస్తుందని చెప్పారు.బిందుసేద్యం కోసం ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీలకు 100 శాతం, ఇతరులకు 90 శాతం సబ్సిడీ అందిస్తుందని తెలిపారు.యాజమాన్య పద్ధతుల కోసం ఎకరానికి రూ.4200 చొప్పున నాలుగేండ్లకు రూ.16.800 రైతుకు అందుతాయని చెప్పారు.ఆసక్తి గల రైతులు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఏఈఓ నాగు,ఫీల్డ్ ఆఫీసర్ సుధాకర్, ఫీల్డ్ అసిస్టెంట్ అమర్‌నాథ్,సర్పంచ్ పల్లె రమణ వీరారెడ్డి, రైతు బంధు మండల కోఆర్డినేటర్ ఆదిరెడ్డి, పలువురు రైతులు పాల్గొన్నారు.



## కూచిపూడి గ్రామంలో చెక్కులు అందజేత

**నవతెలంగాణ-కోదాడరూరల్**

మండలపరిధిలోని కూచిపూడి గ్రామంలో లబ్దిదారులకు శుక్రవారం ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ ఆధ్వర్యంలో చెక్కులు అందజేశారు.బీఆర్ఎస్ ఇన్సూరెన్స్ చెక్కులు, కల్యాణలక్ష్మీ, షాదీ ముబారక్ ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా మంజూరైన చెక్కులను లబ్దిదారులకు ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ స్వయంగా ఇంటికి వెళ్లి పంపిణీ చేశారు. అనంతరం జిల్లా పరిషత్ హై స్కూల్లో సరస్వతి విగ్రహానికి , రూ.5 లక్షల వ్యయంతో నిర్మిస్తున్న సీసీడ్రెయిన్ నిర్మాణపనులకు శంకుస్థాపన చేశారు. గ్రామ ప్రజలంతా ఎమ్మెల్యేకు ఘనస్వాగతం పలికారు.ఎమ్మెల్యే స్వయంగా మా ఇంటికి వచ్చి చెక్కునివ్వడం మాకు ఎంతో ఆనందంగా ఉందని లబ్దిదారులను హర్షం వ్యక్తం చేసి ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎంపీపీ చింత కవిత రాధారెడ్డి, జెడ్పీటీసీ మందలపు కృష్ణకుమారి శేషు, సర్పంచులు శెట్టి సురేష్ నాయుడు,భూక్యా సైదా నాయక్ , ఎంపీటీసీ శంకర్ శెట్టి కోటేశ్వరరావు, గ్రామ శాఖ అధ్యక్షులు అబ్దుల్ , బాదావత్ బాబురావు, బీఆర్ఎస్ నాయకులు భాస్కర్, అప్పారావు, మల్లెల బ్రహ్మయ్య, రామారావు, శెట్టి శీను, తిరుపతయ్య మాజీ సర్పంచ్ బాబురావు, వెంకటేశ్వర్లు, రామకృష్ణ యాదవ్, క్రాంతి కుమార్, బాలకృష్ణ,అధికారులు, తదితరులు పాల్గొన్నారు

# బీజేపీని ఎదుర్కొనే శక్తి ముఖ్యమంత్రి కేసీఆర్‌కే ఉంది

- సీఎం కేసీఆర్‌ను మించిన దార్శనికుడు లేడు
- మంత్రి జగదీశ్‌రెడ్డి

**నవతెలంగాణ-సూర్యాపేట**

జాతీయ స్థాయిలో బీజేపీని ఎదుర్కొనే శక్తి ముఖ్యమంత్రి కేసీఆర్‌కు మాత్రమే ఉందని దేశప్రజలు గుర్తించారని రాష్ట్ర విద్యుత్ శాఖామంత్రి గుంటకండ్ల జగదీష్ రెడ్డి స్పష్టం చేశారు.శుక్రవారం హైదరాబాద్‌లోని మంత్రుల నివాస ప్రాంగణంలో ఆయన మీడియాతో మాట్లాడారు.నాయకత్వ లేమితో కాంగ్రెస్ కొట్టు మిట్టాడుతున్నదన్నారు.ఇక్కడి గల్లీ కాంగ్రెస్ నాయకత్వంతో ఆ పార్టీ క్యాడర్ విసిగిపోయారన్నారు.అభివృద్ధి, ఎజెండాలు ఏమి లేకుండా బూత్ మాటలకే గల్లీ నాయకులు పరిమితం కావడంతో ఆ పార్టీ క్యాడర్ బీఆర్ఎస్‌లోకి బారులు తిరుతున్నారన్నారు.బీజేపీ, కాంగ్రెస్‌లతో తెలంగాణకు తీరని నష్ట వాటిల్లిందని విమర్శించారు.రాహుల్‌గాంధీ నేతృత్వంలో కాంగ్రెస్ నడపడం సాధ్యం కాదన్నది తేలిపోయిందన్నారు.బీఆర్ఎస్‌తోటే దేశానికి భవిష్యత్ ఉంటుందన్నారు.ప్రజల నూతన ఆకాంక్షలను నెరవేర్చేందుకే బీఆర్ఎస్ అవిర్భవించిందన్నారు.కేసీఆర్‌ను మించిన దార్శనికుడు లేడన్నారు.ఈ కార్యక్రమంలో జెడ్పీ వైస్‌చైర్మెన్ గోపగాని వెంకట్‌నారాయణగౌడ్,మున్సిపల్ వైస్‌చైర్మెన్ పుట్ట కిషోర్, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.



# రహదారి ప్రమాదాల నివారణకు చర్యలు

- ఎస్పీ రాజేంద్రప్రసాద్

**నవతెలంగాణ-సూర్యాపేట**

రహదారి ప్రమాదాలను నివారించడానికి అవసరమైన నివారణ చర్యలను చేపట్టామని ఎస్పీ రాజేంద్రప్రసాద్ అన్నారు.జిల్లాలో రోడ్డు భద్రత, రోడ్డు ప్రమాదాల నివారణకు సంబంధించి శుక్రవారం స్థానిక ఎస్పీ కార్యాలయంలో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు.రోడ్డు భద్రత ప్రమాదాల నివారణ పట్ల లోతుగా ఆలోచన చేసి మెరుగైన నివారణ చర్యలు చేపట్టాలని, ఆదిశగా కార్యాచరణ చేయాలని సిబ్బందికి సూచించారు.జీఎంఆర్, జాతీయ రహదారుల సంస్థ, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులతో సమన్వయంగా పనిచేయాలని రోడ్డు ప్రమాదాల నివారణకు కృషి చేయాలని ఆదేశించారు.జాతీయ రహదారుల వెంట ప్రజలకు అవగాహన కల్పించడం,సూచికలు ఏర్పాటు చేయడం, బ్లాక్ స్పాట్స్ వద్ద ప్రమాదాల నివారణకు ఇంకా మెరుగైన చర్యలు తీసుకోవాలని కోరారు.ఇంజనీరింగ్ నిపుణులతో ప్రణాళిక చేయాలని సూచించారు.అజాగ్రత్త నిర్లక్ష్యం వల్ల ఎక్కువ రోడ్డు ప్రమాదాలు సంభవిస్తున్నాయని చెప్పారు. ప్రజలు, వాహన దారులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. రోడ్డు ప్రమాదాల నివారణ అనేది ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని రహదారులపై బాధ్యతగా నడుచుకోవాలని పేర్కొన్నారు.వాహనాలను రహదారులపై ఎక్కడపడితే అక్కడ నిలపవద్దని మద్యం తాగి వాహనాలను నడపవద్దన్నారు.పశువులను రోడ్లపైకి రానివ్వొద్దని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.ఈ సమావేశంలో డీఎస్పీలు వెంకటేశ్వర్‌రెడ్డి, రవి, సూర్యాపేట నాగభూషణం, సూర్యాపేట రూరల్ సీఐ సోమనారాయణ సింగ్, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, మునగాల సీఐ ఆంజనేయులు, కోదాడరూరల్ సీఐ పీఎన్‌డీ.ప్రసాద్, ఎస్సైలు విష్ణుమూర్తి, సాయిరాం, లోకేష్, డీసీఆర్బీ రోడ్ సేఫ్టీ సిబ్బంది పాల్గొన్నారు.



# మనఊరు..మనబడి పనులలో వేగం పెంచాలి

- నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు
- కలెక్టర్ ఎస్.వెంకట్రావ్

**నవతెలంగాణ-సూర్యాపేటకలెక్టరేట్**

మనవూరు మనబడి పథకం కింద జిల్లాలో ఎంపికైన పాటశాలలో జరుగుతున్న పనులను మరింత వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ ఎస్. వెంకట్రావ్ సంబంధిత ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో మనవూరు..మనబడి పనుల పురోగతి పై ఏర్పాటు చేసిన సమావేశంలో ఆదనపు కలెక్టర్ పాటిల్ హేమంత కేశవ్‌తో కలసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం విద్యాభివృద్ధికి అధిక ప్రాధాన్యత ఇస్తుందని, మనవూరు మనబడి పథకం పనులలో ఎక్కడకూడా పనుల విషయంలో రాజీ పడకుండా నిబద్ధతతో పనులను వెంటనే పూర్తి చేయాలని, లేనిపక్షంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని ఆదేశించారు. జిల్లాలో మొదట విడతగా 329 పాఠశాలలు ఎంపికాగా అందులో 324 పాఠశాలలకు అనుమతులు వచ్చాయన్నారు. రూరల్ ఏరియాలో 279 అలాగే అర్బన్ ఏరియాలో 50 లలో పనులు జరుతున్నాయని తెలిపారు.46 పైలెట్,మోడల్ స్కూల్స్‌లలో ఇప్పటికే 3 ప్రారంభించుకున్నామని, మిగిలిన 43 పాఠశాలల పనులను మార్చి నెల 31 నాటికి పూర్తి చేసి అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. ఇకపై పాఠశాల పనుల పరిశీలనకై ఆకస్మిక తనిఖీలు ఉంటాయని హెచ్చరించారు. పాఠశాలలో ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన పనులు సక్రమంగా జరిగేలా ప్రత్యేక చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కొన్ని మండలంలో పనులు పూర్తి అయిన చోట వెంటనే రంగులు వేయాలని, పాఠశాలల సుందరికరణకు ఎక్కువగా మొక్కలను పెంచాలని సూచించారు. పనులు సక్రమంగా జరగని పాఠశాల వివరాలను వెంటనే అందించాలని ఆదేశించారు. ఇకపై పాఠశాలను ఆకస్మికంగా తనిఖీలు చేపట్టనున్నట్లు తెలిపారు. జిల్లాలో 102 జీపీ భవనాలు ఉపాధి హామీ నిధులతో మంజూరైన పనులు వెంటనే చేపట్టాలని సంబంధిత పీఆర్ ఇంజనీరింగ్ అధికారులు, సర్పంచులు అలాగే పంచాయతీ కార్యదర్శులు ఆదేశించారు. అనంతరం మండలాల వారిగా పనుల పురోగతిపై సమీక్షించారు. ఈ సమావేశంలో డీఈఓ అశోక్, పీడీ కిరణ్ కుమార్, డీఈ రమేష్, పీఆర్. ఇంజనీర్లు, ఏఈలు, ఎంఈఓ లు తదితరులు పాల్గొన్నారు.



# నిరుద్యోగుల వద్దకే కంపెనీలు

- బీఆర్ఎస్ నియోజకవర్గ మాజీ ఇన్‌చార్జి కన్మంతరెడ్డి శశిధర్‌రెడ్డి

**నవతెలంగాణ-కోదాడరూరల్**

నిరుద్యోగుల వద్దకే కంపెనీలు తీసుకువచ్చామని బీఆర్ఎస్ నియోజకవర్గ మాజీ ఇన్‌చార్జి కన్మంతరెడ్డి శశిధర్‌రెడ్డి అన్నారు.శుక్రవారం పట్టణంలోని పెరికా భవనంలో ఆయన విలేకర్లతో మాట్లాడారు.నేడు మెగా జాబ్ మేళా కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు.డిగ్రీలు , మాస్టర్ డిగ్రీలు చదివి ఉద్యోగాలు దొరకకా అనేకమంది బాధపడుతున్నారన్నారు.చాలీచాలని జీతాలతో అనేకమంది జీవితాలు దుర్భరంగా మారాయన్నారు. అందుకనే బీఆర్ఎస్ ఆధ్వర్యంలో మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నామన్నారు.ఉద్యోగం కోసం రిజిస్ట్రేషన్ చేసుకున్న అభ్యర్థులు 10 బయోడేటా ప్రతులను వెంట తీసుకు రావాలన్నారు. సుమారు34 నుండి 72 వరకు కంపెనీలు వస్తున్నాయని, వాటికి సంబంధించిన హెచ్‌ఆర్‌లు కూడా వస్తున్నారని తెలిపారు.ఉద్యోగాలకు ఎటువంటి రికమండేషన్లు లేవని తెలిపారు.ఇప్పటివరకు ఐదువేలకు పైగా రిజిస్ట్రేషన్లు అయ్యాయన్నారు.వాటిలో 43శాతం మంది డిగ్రీ అయిపోయి ఉన్న వారు వున్నారని తెలిపారు. ఎటువంటి విద్యార్హత లేని వారికి కూడా ఉద్యోగాలు ఉన్నాయని ట్రాన్స్ జెండర్స్, వికలాంగులకు కూడా ఉద్యోగాలు ఉన్నాయని తెలిపారు. ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అర్హత కు తగిన ఉద్యోగం లభిస్తుందని తెలిపారు. నియోజకవర్గంలో ఎన్నడూ ఇలాంటి కార్యక్రమం నిర్వహించలేదన్నారు.ఉద్యోగం సాధిస్తే కుటుంబం నిలబడుతుందన్నారు.అభ్యర్థులకు భోజన సదుపాయం కల్పిస్తున్నామని, అదేవిధంగా ఉద్యోగం సెలెక్ట్ వివరాలు సాయంత్రం వరకు తెలియజేస్తామన్నారు.వారి వెంట కౌన్సిలర్లు పెండెం వెంకటేశ్వర్లు, తిపరిశెట్టి రాజు, చల్ల రామ్ కళ్యాణ్ మన్మోహన, సత్య, లేఖ, ప్రభాకర్, సప్రాన్, దిలీప్ తదితరులు ఉన్నారు.

## గంజాయి, డ్రగ్స్ నివారణకు జిల్లాకు నార్కోటిక్ డాగ్

- ఎస్పీ రాజేంద్రప్రసాద్

**నవతెలంగాణ-సూర్యాపేట**

అక్రమంగా రవాణా చేస్తున్న గంజాయి, డ్రగ్స్ లాంటి మాదకద్రవ్యాలు గుర్తించి పట్టుబడి చేయడానికి జిల్లాకు నార్కోటిక్ డాగ్ ను కేటాయించారని ఎస్పీ రాజేంద్రప్రసాద్ అన్నారు.ఈ రోలెక్స్ ఎలా పని చేస్తున్నదనే దానిపై శుక్రవారం స్థానిక బస్టాండ్‌లో డాగ్ హ్యాండిలర్ రిహార్సల్‌ను నిర్వహించారు.ఈ సందర్భంగా రిహార్సల్‌లో బాగంగా బ్యాగ్స్, బస్సులు, భూమిలో, మనిషి వద్ద దాచి ఉంచిన గంజాయిని డాగ్ గుర్తించగల్గినదన్నారు.జిల్లాలో గంజాయి, ఇతర మాదకద్రవ్యాలు లాంటి వాటి రవాణాను నివారించడానికి జిల్లా పోలీస్‌శాఖ ప్రతిష్టమైన చర్యలు తీసుకుందని పేర్కొన్నారు. జిల్లావ్యాప్తంగా టన్నులకొద్దీ గంజాయిని సీజ్ చేశామన్నారు.గంజాయి నివారణలో ఉక్కుపాదం మోపడంలో భాగంగా జిల్లా పోలీస్ శాఖకు నార్కోటిక్‌ను కేటాయించడం జరిగిందని తెలిపారు.డాగ్ రోలెక్స్ గంజాయిని గుర్తించడం అభినందనీయమన్నారు.ఈ కార్యక్రమంలో డీఎస్పీ లు నాగభూషణం, రవి, వెంకటేశ్వరరెడ్డి,సీఐలు శ్రీనివాస్, సోమ్‌నారాయణ్‌సింగ్, ఆంజనేయులు, ప్రసాద్, గౌరీనాయుడు, ఆర్‌ఐలు శ్రీనివాసరావు, శ్రీనివాస్, గోవిందరావు, డాగ్ స్క్వాడ్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఆర్థికసాయం అందజేత

**నవతెలంగాణ-ఆత్మకూరుఎస్**

మండలంలోని కొత్తతండాకు చెందిన గుగులోత్ పవన్ ఇటీవలకాలంలో రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు.పాతర్లపహాడ్‌లో 10తరగతి చదివిన మిత్రులు రూ.17 వేల ఆర్థికసాయాన్ని శుక్రవారం పవన్ తల్లిదండ్రులకు అందజేశారు.ఈ కార్యక్రమంలో రాజేష్, రమేష్, మహేష్, సతీష్, మహేష్,నరేష్, మహేష్, అశోక్,హరీష్, సందీప్, పాల్గొన్నారు.



## నర్సింహులగూడెంలో కంటి వెలుగు

**మునగాల** :రేపాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంపరిధిలోని నర్సింహులగూడెంలో శుక్రవారం రెండో విడత కంటి వెలుగు వైద్య శిబిరాన్ని ఎంపీపీ యలక బిందు నరేందర్‌రెడ్డి ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కంటి సమస్యలతో బాధపడుతున్న వారు ఈ వైద్య శిబిరాలను సద్వినియోగం చేసు కోవాలని కోరారు.వైద్యాధికారి యోల్లా శ్రీశైలం మాట్లాడుతూ కంటి సమస్యలు నివారణకు ఆకుకూరలు,పండ్లు, క్యారెట్, బొప్పాయి, చేపలు, కోడిగుడ్లు ఎక్కువగా తీసుకోవాలని తెలిపారు.సెల్ ఫోన్ వాడకం తగ్గించి టీవీలకు దూరం నుండి చూడాలన్నారు.135 మందికి పరీక్షలు నిర్వహించామన్నారు.45 మందికి రీడింగ్ కళ్లద్దాలు పంపిణీ చేసి 27 మందిని ఆపరేషన్ కోసం గుర్తించామన్నారు, 41మందికి సిప్రోఫ్లాక్సిన్ చుక్కల మందు,ఏ,డీ విటమిన్ మాత్రలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ వెంకటేశ్వర్లు సర్పంచ్ కొప్పు ప్రమీల, ఉపసర్పంచ్ పులి నాగేశ్వరరా వు,ఎంపీటీసీ మదార్‌బీ, పంచాయతీ కార్యదర్శి సత్యనారాయణ, క్యాంప్ మెడికల్ ఆఫీసర్ కత్తి రవళి, హెల్త్ సూపర్వైజర్ శ్రీనివాస్,కంటి వెలుగు టీమ్ మేనేజర్ లింగం రామకృష్ణ, ఆప్తాల్మిక్ ఆఫీసర్ రమేష్, డీఈఓ,శైలజ.ఏఎన్ఎంలు,ఆశా వర్కర్లు పాల్గొన్నారు.



## బీఆర్ఎస్‌లో చేరిన కాంగ్రెస్ కౌన్సిలర్ భద్రమ్మ

**నవతెలంగాణ-సూర్యాపేట**

కాంగ్రెస్ కౌన్సిలర్ కొండపల్లి భద్రమ్మ సాగర్‌రెడ్డిలు శుక్రవారం హైదరాబాద్‌లోని మంత్రుల నివాస ప్రాంగణంలో విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు.ఈ సందర్భంగా వారికి మంత్రి గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.పార్టీలో చేరిన వారిలో ఐఎన్‌టీయూసీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కొండపల్లి సాగర్‌రెడ్డి, ఐఎన్టీయూసీ జాతీయ యూత్ వర్కింగ్ ప్రెసిడెంట్ పవన్‌కుమార్‌రెడ్డి,కాంగ్రెస్ జిల్లా నాయకులు రషీద్, కాంగ్రెస్ పట్టణ కార్యదర్శి అబ్దుల్ రెహమాన్, పట్టణ నాయకులు జమాల్ బాబా, పుట్ట రవీందర్‌రెడ్డి, అమర్‌నాథ్‌రెడ్డి పాటు పలువురు చేరారు.ఈ కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ వెంకటనారాయణ గౌడ్, మున్సిపల్ వైస్ చైర్మన్ పుట్ట కిషోర్, కౌన్సిలర్లు జహీర్, మడిపల్లి విక్రమ్, నాయకులు బైరు వెంకన్న, గుడిపుడి వెంకటేశ్వరరావు, సయ్యద్‌సలీం, మీలా వంశీ,బైరబోయిన శ్రీనివాస్, పల్స వెంకన్న తదితరులు పాల్గొన్నారు.



## నట్టల నివారణ మందులు పంపిణీ

**నవతెలంగాణ-గరిడేపల్లి**

మండలపరిధిలోని సర్వారం, లక్ష్మీపురం, అబిరెడ్డిగూడెం గ్రామాలలో శుక్రవారం మండల పశు వైద్యాధికారి డాక్టర్ సిహెచ్ నాగేంద్ర ఆధ్వర్యంలో జీవాలకు నట్టల మందు తాపించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీవాలలో నట్టల వలన జరిగే నష్టాలను వివరించామన్నారు. నట్టల నివారణ మందు ద్వారా మూగజీవాలలో వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందని తద్వారా ఆరోగ్యం మెరుగుపడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా 1157 గొర్రెలకు, 492 మేకలకు నట్టల ముందు తాపించినట్లు, దాని ద్వారా మొత్తం 19 మంది రైతులు లబ్ది పొందినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ చిలక కాశయ్య, గొర్రెల మేకల పెంపకం దారుల సహకార సంఘం మాజీ అధ్యక్షుడు సల్ల నాగయ్య, సిబ్బంది శేఖర్, అజహర్ మరియు రైతులు పాల్గొన్నారు.

## కంటి వెలుగుతో పేదల జీవితాల్లో నూతన వెలుగులు

**నవతెలంగాణ-సూర్యాపేట**

ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రెండో విడత కంటి వెలుగు కార్యక్రమం పేదల జీవితాల్లో వెలుగులు నింపుతుందని మున్సిపల్ చైర్‌పర్సన్ పెరుమాళ్ల అన్నపూర్ణ శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం స్థానిక 15వ వార్డు అక్షర పాఠశాలలో ఏర్పాటు చేసిన కంటి వెలుగు వైద్య శిబిరాన్ని ఆమె ప్రారంభించి మాట్లాడారు. అందత్వ రహిత తెలంగాణ నిర్మాణమే లక్ష్యంగా ముఖ్యమంత్రి కేసీఆర్ కంటి వెలుగు కార్యక్రమాన్ని చేపట్టారని పేర్కొన్నారు. పెద్ద ఆసుపత్రులకు వెళ్లి కంటి పరీక్షలు చేయించుకోలేని నిరుపేదలకు కంటి వెలుగు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని అన్నారు. మంత్రి గుంటకండ్ల జగదీష్ రెడ్డి సహకారంతో పట్టణంలోని అన్ని వార్డులలో కంటి వెలుగు వైద్య శిబిరాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ముఖ్యంగా ప్రజలు కంటి పరీక్షలను నిర్లక్ష్యం చేయకుండా సరైన చికిత్సలు చేయించుకుని మందులు, అద్దాలు పొంది కంటి సమస్యలను దూరం చేసుకోవాలన్నారు. అనంతరం వాటరింగ్ డే సందర్భంగా వార్డులోని మొక్కలకు నీళ్ల పోసి వార్డులోని ప్రజలంతా హరితహారంలో నాటిన మొక్కలను సంరక్షించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ ఎలిమినేటి అభినయ్, మున్సిపల్ ఈఈ జి కే డి ప్రసాద్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ సారగండ్ల శ్రీనివాస్ ,పాఠశాల ప్రిన్సిపల్ పిల్లల వెంకటేశ్వర్లు, డాక్టర్ మౌనిక, ఏఎన్ఎం సునీత, ఆశాలు చైతన్య, వసంత, మరియమ్మ, ఆర్పీలు అనపర్తి రాణి, రాజేశ్వరి, వార్డు ప్రముఖులు సకినాల జానయ్య, రావుకుల్లు వెంకన్న, రావుకొల్లు లింగయ్య,బొలికొండ రవి, అన్నపూర్ణపు నరేందర్, మనీ, సాయి, ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీనివాసాపురం నైపుణ్య శిక్షణ

**నవతెలంగాణ-హుజూర్‌నగర్‌రూరల్**

తెలంగాణ ప్రభుత్వం కార్మిక శాఖ వారి సకారంతో భవన మరియు ఇతర నిర్మాణ రంగ కార్మికుల సంక్షేమ మండలి (బీఓసీడబ్లూడబ్ల్యూబీ) ద్వారా కార్మిక సంక్షేమ మండలిలో నమోదైయున్న లేబర్ కార్డు కలిగియున్న వారికి తాపీ పని ప్లంబింగ్ ఎలక్ట్రికల్, పెయింటర్‌లకు 15 రోజులు ఉచిత నైపుణ్య శిక్షణా కార్యక్రమం నిర్వహించారు.మధ్యాహ్న భోజనంతో పాటు సర్టిఫికెట్‌తో పాటు రూ.4500 స్టయిఫండ్ చెల్లిస్తామన్నారు.ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ కొప్పులసైదిరెడ్డి, సర్పంచ్ పత్తిపాటి రమ్యనాగరాజు మాట్లాడుతూ లేబర్ కార్డు కలిగిఉన్న ప్రతిఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రతి ఒక్కరికి ఇన్సురెన్స్ వర్తిస్తుందని చెప్పారు. దీని ద్వారా భవిష్యత్‌లో బ్యాంకర్స్ ద్వారా లోన్స్ కూడా ఇస్తారని చెప్పారు.టీ షర్ట్, బ్యాగు, హెల్మెంట్ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో శిక్షణ అధ్యాపకులు సుదర్శన్, నమ్మానాయక్, బీఆర్ఎస్ నాయకులు, మేదరి శ్రీను, గ్రామశాఖ అధ్యక్షుడు జింకల శ్రీను, శాఖమూరి పాపారావు, జింకల పెద్దవెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## ఇన్‌చార్జి ఎంపీఓగా జానయ్య

**నవతెలంగాణ-పెన్‌పహాడ్**

మండలంలో గత కొంతకాలంగా ఎంపీఓగా విధులు నిర్వహిస్తున్న నరేష్ వ్యక్తిగత కారణాలతో సెలవులోకి వెళ్లడంతో మొరుసకుంట పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్న చెరుకుపల్లి జానయ్యకు ఇన్‌చార్జి ఎంపీఓగా బాధ్యతలు అప్పగిస్తున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీఓ బాణాల శ్రీనివాస్ తెలిపారు.ఈ సందర్భంగా జానయ్య మాట్లాడుతూ ఎంపీఓ విధులు సక్రమంగా నిర్వహిస్తానని తెలిపారు.

## రైతులకు రూ.లక్ష రుణమాఫీ చేయాలని వినతి

**నవతెలంగాణ-నేరేడుచర్ల**

రూ.లక్ష రుణమాఫీ చేయాలని కోరుతూ సీపీఐ, రైతుసంఘం ఆధ్వర్యంలో శుక్రవారం తహసీల్దార్ సరితకు వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా సీపీఐ జిల్లా నాయకులు ధూళిపాళ ధనుంజయనాయుడు మాట్లాడారు.నాడు ఇచ్చిన వాగ్దానాలు చిత్తశుద్ధి అమలు చేయడంలో తెలంగాణ ప్రభుత్వం వెనకపట్టు పట్టిందన్నారు.ధనిక రాష్ట్రంగా ఉన్న తెలంగాణ రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా తయారు చేశారన్నారు.వినతిపత్రం అందజేసిన వారిలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు రావుల సత్యం, సీపీఐ పట్టణ కార్యదర్శి కత్తి శ్రీనివాసరెడ్డి, ఏఐవైఎఫ్ సూర్యాపేట జిల్లా అధ్యక్షులు చిలకరాజు శ్రీను, ఏఐఎస్ఎఫ్ నాయకులు రేఖ ఉపేందర్, అనంతు ఆంజనేయులు, ఎం.దేవయ్య, సయ్యద్ హుస్సేన్ తదితరులు ఉన్నారు.

# కంటి వెలుగును సద్వినియోగం చేసుకోవాలి

నవతెలంగాణ- ఆలేరురూరల్

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ వంగాల శ్రీశైలం అన్నారు. శుక్రవారం మండలంలోని తూర్పు గూడెం గ్రామంలో కంటి వెలుగు కార్యక్రమం డాక్టర్ నవీన్ కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామస్తులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో నోడల్ ఆఫీసర్ పెద్ద లక్ష్మి ఏఎన్ఎం కవిత రెడ్డి ,అనుజ ఆశ వర్కర్లు సువర్ణ, శీల గ్రామపంచా సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# పండ్లు పంపిణీ

నవ తెలంగాణ- భువనగిరి రూరల్

రోటరీ డే సందర్భంగా జిల్లా కేంద్రంలోని ఎస్ వి హోటల్లో పని చేసే కార్మికులకు శుక్రవారం పండ్లు పంపిణీ చేశారు. ముందుగా కేక్ కట్ చేసి, స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రోటరీ క్లబ్ అధ్యక్షుడు బండారు శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా రోటరీ చేస్తున్న సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో రొటేరియన్ క్లబ్ పూర్వ అసిస్టెంట్ గవర్నర్ శెట్టి బాలయ్య యాదవ్ , ఎలెక్ట్ అసిస్టెంట్ గవర్నర్ నిమ్మయ్య, కార్యదర్శి కరిపె నర్సింగ్ రావు, ఎన్నిక అధ్యక్షులు డాక్టర్ రఘు వేంకట సురేష్, ఎన్నిక అసిస్టెంట్ గవర్నర్ నిమ్మయ్య , పూర్వ అసిస్టెంట్ గవర్నర్ శెట్టి బాలయ్య యాదవ్,ఎన్నిక కార్యదర్శి ఆగేశ్వర్ రావు,పూర్వ కార్యదర్శి కిషన్ జీ, క్లబ్ డైరెక్టర్లు వేణు, చారి పాల్గొన్నారు.

# బాలల రక్షణ పట్ల తల్లిదండ్రులు అవగాహన కలిగి ఉండాలి

- యాదాద్రిభువనగిరి జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి

నవతెలంగాణ -బీబీనగర్

బాలల రక్షణ, వారి హక్కుల పట్ల తల్లిదండ్రులు పూర్తి అవగాహన కలిగి ఉండాలని జిల్లా కలెక్టర్ పమేల సత్పతి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో ప్రజా పరిషత్ పాఠశాల ఆవరణలో విద్యార్థులు వారి తల్లిదండ్రులకు స్నేహిత రెండవ విడత అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కలెక్టర్ పాల్గొని మాట్లాడుతూ బాలల హక్కులను కాపాడటం వారి సంరక్షణ బాధ్యత పట్ల తల్లిదండ్రులకు అవగాహణ కల్పించేందుకు గాను గత సంవత్సరం జూలై, ఆగస్టు, సెప్టెంబర్ నెలలో స్నేహిత మొదటి విడత కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగిందని తెలిపారు, ఈ కార్యక్రమాన్ని ప్రజాప్రతినిధులు అధికారులు సమన్వయంతో జిల్లా వ్యాప్తంగా 26 టీంలను ఏర్పాటు చేసి 17 మండలాలలో 271 పాఠశాలలో ఆరో తరగతి నుండి పదవ తరగతి విద్యార్థులకు సుమారు 43 వేల మందికి ఆహ్వాన కల్పించడం జరిగిందని తెలిపారు, గత సంవత్సరం మాదిరిగానే ఈ సంవత్సరం కూడా జిల్లా వ్యాప్తంగా 17 మండలాల్లో 42 టీముల ఏర్పాటుతో 251 ప్రాథమిక




భువనగిరి

పాఠశాలలో ఒకటవ తరగతి నుండి 5వ తరగతి చదివే 17058 మంది బాలలకు ఐదు అంశాలలో అవగాహన కల్పించడం జరుగుతుందని పేర్కొన్నారు, మంచి స్పర్శ, చెడు స్పర్శ ,విద్యా ప్రాముఖ్యత, పరిసరాలపై అవగాహన, ఇంటర్నెట్ దుర్వినియోగం, ఆరోగ్యకర అలవాట్లు, భౌతిక వ్యాయామం, వంటి అంశాలపై విపులంగా తెలియజేయడం జరుగుతుందని అన్నారు, ఇందుకు ప్రజాప్రతినిధులు సహకారంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు తెలిపారు. అంతకుముందు డిప్యూటీ పోలీస్ కమిషనర్ రాజేష్ చంద్ర మాట్లాడుతూ విద్యార్థుల భద్రత పట్ల పోలీస్ శాఖ పూర్తిగా అండగా ఉంటుందని తెలిపారు, పిల్లల హక్కులను కాపాడడంలో పోలీసు శాఖ ముందుంటామని తెలిపారు. అదనపు కలెక్టర్ దీపక్ తీవారి మాట్లాడుతూ జిల్లాలో బాలల సంరక్షణ కోసం స్నేహిత కార్యక్రమాన్ని చేపట్టి బాలల ఎదుర్కొంటున్న సమస్యలు వాటి నిరోధానికి తీసుకోవాల్సిన జాగ్రత్తల పట్ల విద్యార్థులకు, తల్లిదండ్రులకు అవగాహణ కల్పిస్తున్నామని బాలల రక్షణ, హక్కులను సంరక్షిస్తే నే మంచి సమాజం నిర్మితమవుతుందని అన్నారు, ఈ కార్యక్రమంలో ఎంపీపీ యెర్కల సుధాకర్ గౌడ్, జడ్పిటిసి గోళి ప్రణీత పింగల్ రెడ్డి, స్థానిక సర్పంచ్ మల్లగారు భాగ్యలక్ష్మి శ్రీనివాస్, ఎంపీడీవో శ్రీవాణి, ఎం ఆర్ వో అశోక్ రెడ్డి, మండల విద్యాధికారి నాగవర్ధన్ రెడ్డి, కలెక్టరేట్ సూపర్డెంట్ నాగలక్ష్మి, జిల్లా బాలల సంరక్షణ అధికారి సైదులు, ఉపసర్పంచ్ ఎండి దస్తగిరి, ఎస్ఎంసి చైర్మన్ నాగలక్ష్మి, చిన్నారులు, వారి తల్లిదండ్రులు, తదితరులు పాల్గొన్నారు.




బీబీనగర్

**భువనగిరి :** స్నేహిత ఫేస్ - 2 కార్యక్రమంలో భాగంగా గంజి ప్రైమరీ స్కూల్లో స్నేహిత ప్రోగ్రాం నిర్వహించారు. ఈ సందర్భంగా సీడబ్ల్యూసీచైర్‌పర్సన్ బండారు జయశ్రీ మాట్లాడుతూ కలెక్టర్ పమేలా సత్పతి విద్యార్థుల కోసం ప్రత్యేకంగా రూపొందించిన కార్యక్రమం స్నేహిత అని అన్నారు. ఇందులో ఐదు అంశాలు ఉన్నాయని తెలిపారు. ఒకటి గుడ్ టచ్ బ్యాడ్ టచ్.. సెల్ఫ్ ప్రొటెక్షన్ అండ్ అవేర్నెస్.. సెల్ ఫోన్ మాడటంలో లాభనష్టాలు.. ఎడ్యుకేషన్ ఇంపార్టెన్స్... హెల్త్ అండ్ న్యూట్రిషన్ ఈ ఐదు అంశాల మీద విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నట్టు తెలిపారు. పిల్లలు ఎవరైనా ఏదైనా ఇబ్బందుల్లో ఉన్నప్పుడు 1098 కి లేదా 100 కి కాల్ చేయాలని వారికి సంబంధించిన రక్షణ సంరక్షణ చర్యలు శిశు సంక్షేమ శాఖ చేపడుతుందని తెలిపారువార్డు కౌన్సిలర్ భవాని మాట్లాడుతూ ఈ పాఠశాలలో విద్యార్థులకు మంచి బోధన అందిస్తూ అన్ని రకాల యాక్టివిటీస్ లో పిల్లలు పాలుపంచుకునేలాగా తీర్చిదిద్దుతున్న పాఠశాల టీచర్స్ ను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ మౌన్యా రెడ్డి ప్రధానోపాధ్యాయులు సంతోష్ , టీచర్ సరిత ,అంగన్వాడి సూపర్వైజర్ నర్మదా, టీచర్స్ లలిత పుష్ప పాల్గొన్నారు.

**భువనగిరిరూరల్ :** స్నేహిత కార్యక్రమాల ద్వారా బాలల సంరక్షణ, వారి హక్కుల పరిరక్షణ పట్ల అవగాహనా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఎంపిపి నరాల నిర్మల వెంకటస్వామి యాదవ్,జెడ్పీటీసీ సబ్బూరు బీరు మల్లయ్య తెలిపారు. శుక్రవారం బోల్లపల్లి గ్రామంలో స్నేహిత కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. స్నేహిత కార్యక్రమాల ద్వారా బాలలపై హింస, వేధింపులు లాంటి సంఘటనలకు గురి కాకుండా, బాలలకు పౌష్టికాహార ప్రాముఖ్యత, విద్య యొక్క ప్రాముఖ్యతలపై అవగాహన కల్పిస్తూ పిల్లలు తమను తాము స్వతహాగా రక్షించుకునే మార్గాలను విడమరచి అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. అనంతరం బాలింతలకు కేసీఆర్ కిట్టులను అందజేశారు. స్నేహిత కార్యక్రమం ను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల వైద్యాధికారి రవీంద్రాని, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు, బాలబాలికల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

**అడ్డగూడూరు :** మండలంలోని లక్ష్మీదేవికాల్వ గ్రామంలో అంగన్వాడీ ఆధ్వర్యంలో ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు స్నేహిత కార్యక్రమంపై అవగాహన కల్పించారు. విద్యార్థులకు హెల్త్ న్యూట్రీషన్లు, స్కూల్ ఎడ్యుకేషన్ ,గుడ్ టచ్ బ్యాడ్ టచ్ ,పై వివరించి ,సమయం వృధా చేయకుండా టివి సెల్ ఫోన్ ఇంటర్నెట్ పిల్లలపై చెడు ప్రభావం పై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ అధికారి కృష్ణ, ఎంపిడిఓ చంద్రమౌలి ,ఎంపిఓ ప్రేమలత,అంగన్వాడీ సూపర్ వైజర్ మధుర ,సర్పంచ్ నారగోని అంజయ్య గౌడ్ ,ప్రదాననోపాధ్యాయులు రాణి ,నివేదిక,ఎస్ ఎం సి చైర్మన్ బండి నర్సయ్య, అంగన్వాడీ టీచర్లు మమత ,నిరీక్షణ, రాములమ్మ,పంచాయతీ కార్యదర్శి గడ్డం గిరిబాబు తదితరులు పాల్గొన్నారు.

**బొమ్మలరామరం :** మండలంలో వీరారెడ్డిపల్లి గ్రామ ప్రాథమికోన్నత పాఠశాలలో స్నేహిత ఫేస్-2 కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా సర్పంచ్ జక్కుల శ్రీవాణి వెంకటేష్ యాదవ్ విద్యార్థులకు స్నేహిత ప్రోగ్రాంలోని అంశాల గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి లాలయ్య,ఉపాధ్యాయులు లత , స్వప్న , రమణి ,అంగన్వాడి సూపర్ వేజర్ విజయలక్ష్మి,విసిపిసి కమిటీ మెంబర్ ఇస్తారి,ఏఈఓ జెస్సి, అంగన్వాడి టీచర్లు భాగ్యలక్ష్మి, వర్షిత ఆశా కార్యకర్తలు విద్యార్థులు పాల్గొన్నారు,

**రామన్నపేట :** మండలంలోని కొమ్మాయిగూడెం గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం స్నేహిత ఫేస్ టు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామీణ అభివృద్ధి శాఖ అదనపు ప్రాజెక్టు డైరెక్టర్ నాగిరెడ్డి, గ్రామ సర్పంచ్ జల్లెల లక్ష్మమ్మ పెంటయ్య, ఐసిడిఎస్ సూపర్వైజర్ కే స్వాతి పలు అంశాలపై అవగాహన కల్పించారు. గుడ్ టచ్ బ్యాడ్ టచ్ తేడాలను, సెల్ఫ్ డిఫెన్స్ ఎలా చేసుకోవాలో విద్యార్థులకు వివరించారు. అత్యవసర సమయంలో 100, 1098 నెంబర్లకు ఫోన్ చేయాలని తెలిపారు. ఇంటర్నెట్ వినియోగం పై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఎస్ఎంసి చైర్మన్ కాటంరాజు, రిసోర్స్ పర్సన్స్ నవనీత, పుష్ప, ఏ ఈ ఓ శృతి, ప్రధానోపాధ్యాయులు జి ఆనంద్, ఉపాధ్యాయులు జీ వెంకటేశ్వర్లు, రాధిక అంగన్వాడి ఉపాధ్యాయులు సత్యవతి, ప్రతిభ పాల్గొన్నారు.



# మురుగు కాల్వ పనులను పరిశీలించిన ఎమ్మెల్యే

నవతెలంగాణ - భువనగిరి

పట్టణంలోని సమద్ చౌరస్తా నుండి జంఖాన్ గూడ వరకు నిర్వహిస్తున్న భూగర్భ మురుగు నీరు కాల్వ పనులను ఎమ్మెల్యే పైళ్ల శేఖర్ రెడ్డి శుక్రవారం పరిశీలించారు. పనుల్లో నాణ్యత పాటించాలని, ఇంజనీర్లు తగిన నమూన సూచనలు ఇవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మెన్ ఎనబోయిన ఆంజనేయులు, వైస్ చైర్మెన్ చింతల కిష్టయ్య, కమీషనర్ నాగిరెడ్డి, కౌన్సిలర్ పంగరెక్కల స్వామి, పాల్గొన్నారు.




# యూనిటీ పీజీ కళాశాలలో ఫ్రెషర్స్ డే వేడుకలు

నవతెలంగాణ -భువనగిరిరూరల్

మండల పరిధిలోని రాయగిరి నందు గల యూనిటీ పీజీ కళాశాలలో శుక్రవారం ఎంబీఏ విద్యార్థులకు ఫ్రేషర్స్ డే వేడుకలు నిర్వహించారు. నూతన విద్యార్థుల స్వాగతం పలకడం లో భాగంగా పరిచయ్- 2౩23 కార్యక్రమాన్ని నిర్వహించారు. కళాశాల చైర్మెన్ ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు విద్యతో పాటు ఉద్యోగ ఉపాధికి కావలసిన అన్ని నిపుణ్యాలను పెంపొందించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ పీ గోవర్ధన్ రెడ్డి, పీ జి కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఏం ఎస్ సరిత, యూనిటీ ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాస్, కళాశాల అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ పీ సునీత, ఏంబిఏ హెచ్ ఓ డీ కే మహేష్, ఉపన్యాసాక బృందం జీ బాబు, సురేష్, రాధా, క్రాంతి కుమార్, లత, సంపత్, భరత్, కృష్ణ, విద్యార్థులు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు

నవతెలంగాణ-బొమ్మలరామరం

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలపాలైన సంఘటన మండలంలోని చీకటిమామిడి కాజీపేట మధ్య ప్రాంతంలో శుక్రవారం జరిగింది. . స్థానికులు ప్రయాణికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని మర్యాల గ్రామానికి చెందిన బుచ్చుల కుమార్ ,ఎర్రోళ్ల బాల నరసింహ్మా పెద్ద పర్వతాపురం గ్రామంలో అంత్యక్రియలో పాల్గొని తిరిగి స్వగ్రామానికి బైకుపై వస్తున్నారు. మార్గమధ్యలో ఉన్న ఇటుక బట్టి ప్రాంతంలో టాటా ఏసీ వాహనం ఢీకొని తీవ్ర గాయాల పాలయ్యారు. చికిత్స నిమిత్తం వారిని గాంధీ హాస్పిటల్ కి తరలించారు. రోడ్డుపైనే ఉన్న ఇటుక బట్టిల వలన పొగ దుమ్ము పడి ఇలాంటి ప్రమాదాలు తరచూ జరుగుతున్నా ఎవరు పట్టించుకోవడంలేదని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



# రైతులకు నాణ్యమైన విద్యుత్ అందించాలి



నవతెలంగాణ- వలిగొండరూరల్

ఎండాకాలం ప్రారంభంలోనే విద్యుత్ కోతలు రైతులకు ఎదురవుతున్నాయని ప్రభుత్వం అధికారులు వెంటనే విద్యుత్ కోతలను నివారించేందుకు తగు చర్యలు చేపట్టాలని రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మాటూరు బాలరాజు గౌడ్ డిమాండ్ చేశారు. శుక్రవారం వెల్వర్తి గ్రామంలో స్థానిక సబ్ స్టేషన్ ఎదుట నిరసన వ్యక్తం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ కోతలు లేకుండా 24 గంటల విద్యుత్తును నిరంతరాయంగా సరఫరా చేస్తున్నామని ఒకవైపు గొప్పలు చెబుతూ మరోవైపు విద్యుత్ కోతలను విధించడం వల్ల పంట పొలాలు ఎండిపోతున్నాయన్నారు. విద్యుత్ కోతల వల్ల పొట్ట దశలో ఉన్న వరి పొలాలకు సక్రమంగా నీరందకపోవడంతో పంటలో దిగుబడి రాదన్నారు. వెంటనే ప్రభుత్వం అధికారులు విద్యుత్‌ను సక్రమంగా 24 గంటల పాటు అందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి సిర్పంగి స్వామి పిఎస్ఎం జిల్లా కార్యదర్శి ఈర్లపల్లి ముత్యాలు, రైతు సంఘం మండల అధ్యక్ష కార్యదర్శులు మొగిలిపాక గోపాల్, కందడి సత్తిరెడ్డి, మండల నాయకులు కల్యారి ముత్యాలు, ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి వేముల నాగరాజు పాల్గొన్నారు

# ప్రజ సంక్షేమానికి చివరి శ్వాస వరకు పోరాడుతా

- ప్రభుత్వ విప్ సునీత మహేందర్ రెడ్డి

నవతెలంగాణ -ఆలేరుటౌన్

ప్రజా సంక్షేమం కోసం చివరి శ్వాస వరకు పోరాడుతానని ప్రభుత్వ విప్, ఆలేరు శాసన సభ్యురాలు గొంగిడి సునీత మహేందర్ రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వృథాగా పోతున్న మూసీ జలాలను వినియోగంలోకి తేవాలని లక్ష్యంతో బునాది గాని కాల్వపనులను 2006 సంవత్సరంలో శంకుస్థాపన చేసిన సంగతి గుర్తు చేశారు. బీబీనగర్ మండలం లోని మక్త అనంతరం గ్రామం నుండి మోత్కూరు మండలంలోని ధర్మారం ఊర చెరువు వరకు కాలువలను నిర్మించాలని నిర్ణయించామని పేర్కొన్నారు. కాళేశ్వరం జలాలను ఈ కాలువ ద్వారా అందించాలని దృఢ సంకల్పంతో ఉన్నట్టు పేర్కొన్నారు. వీరవల్లి వద్ద కాళేశ్వరం జలాలను బునాదిగాని కాలువలో పంపిం చాలని నిర్ణయించి నట్టు తెలిపారు. దీని వల్ల భూసేకరణ చేపట్టాల్సిన అవసరంఉండక పోవడమే కాకుండా వందల కోట్ల రూపాయల వరకు వ్యయం ఆదా చేసిన వారమవుతామని పేర్కొన్నారు.



# సంక్షేమ పథకాల అమలుకు గొంగిడి దంపతుల కృషి

నవతెలంగాణ- ఆలేరుటౌన్

ముఖ్యమంత్రి కేసీఆర్ నేతృత్వంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన, అభివృద్ధి సంక్షేమ పథకాల అమలుకు నియోజకవర్గంలో , రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు శాసనసభ్యురాలు గొంగిడి సునీత, డీసీసీబీచైర్మెన్ గొంగిడి మహేందర్ రెడ్డి దంపతులు కృషి చేస్తున్నారనిలారీ ఓనర్ అసోసియేషన్ ముఖ్య సలహాదారులు బర్మా వెంకటేశ్ తెలిపారు. శుక్రవారం స్థానికంగా ఆయన మాట్లాడుతూ కంటి వెలుగు, ఇతర సంక్షేమ పథకాలు ఆలేరు ప్రజలకు అందించడంలో ముందున్నారన్నారు. కంటి వెలుగు కార్యక్రమంలో ప్రతి డ్రైవర్ చేయించుకుని డాక్టర్లు సూచించిన కళ్ళద్దాలు, కానీ ఆపరేషన్ ఇతర సదుపాయాలు పొంది అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కార్యవర్గ సభ్యులు బీబీ నగరం మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

# వంతెన నిర్మాణ పనులను వేగవంతం చేయాలి

నవతెలంగాణ -భూదాన్ పోచంపల్లి

మండల పరిధిలోని శివారెడ్డి గూడెం గ్రామం నుండి దంతూర్ గ్రామానికి వెళ్లే దారిలో వాగు పైన వంతెన నిర్మాణ పనులను వేగవంతం చేయాలని సీపీఐ(ఎం) మండల కార్యదర్శి పగిళ్ల లింగారెడ్డి అన్నారు. శుక్రవారం శివ రెడ్డి గూడెం దంతూర్ గ్రామాల మధ్యన ఉన్న మూసీ నది బ్రిడ్జిని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వంతెన నిర్మాణం పనులు నత్తనడకన నడుస్తున్నాయన్నారు. వెంటనే పనులను వేగవంతం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో శాఖ కార్యదర్శి వారాల మల్లారెడ్డి మండల కమిటీ సభ్యులు కోటా రామచంద్రారెడ్డి ,మంచాల మధు, నాయకులు వెంకటేశ్, వీరారెడ్డి ,చింటూ పాల్గొన్నారు .



# అర్హులైన వారికి పింఛన్ ఇవ్వడంలో విఫలం

నవతెలంగాణ -తుర్కపల్లి

అర్హులైన వారికి పింఛన్లు ఇవ్వడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యులు గడ్డం వెంకటేష్, మండల కార్యదర్శి పోతరాజు జహంగీర్ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని తిరుమలాపురం గ్రామంలో ఇంటింటికి సీపీఐ(ఎం) కార్యక్రమం నిర్వహించారు. గతంలో పింఛన్ పొంది ఇప్పుడు రాకపోవడం వల్ల అర్హులైన పేదలు మనోవేదనకు గురై అనేక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు అర్హులను గుర్తించి పింఛన్ మంజూరు చేయాలని లేని పక్షంలో పోరాటాలు నిర్వహిస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో ఆ పార్టీ మండల కమిటీ సభ్యులు గడ్డమీద నరసింహ, కోట నాగరాజు, రాజుపాల్గొన్నారు.



# హెరిటేజ్ ఇన్సూరెన్స్ చెక్కు అందజేత

నవతెలంగాణ- భువనగిరిరూరల్

మండలంలోని కునూర్ హెరిటేజ్ పాల సేకరణ కేంద్రంలో పాడి రైతు కాశపక నరేష్ (గ్రామం కేసరం ) ప్రమాదవశాత్తు విద్యుద్ఘాతంతో చనిపోయాడు. రైతు ప్రమాద బీమా కింద నామినిగా ఉన్న అతని భార్య కాశపక శిరీష రూ. 2,02500చెక్కును శుక్రవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో హెరిటేజ్ డెయిరీ తెలంగాణ రిజినల్ హెడ్ నర్సింగ్ రావు, హెరిటేజ్ ఫుడ్స్ యాక్టివిటీ హెడ్ శ్రీనివాస్ , డాక్టర్ శ్రీనివాస్ ,కునూర్ గ్రామ ఎంపీటీసీ పాశం శివనంద్, ఉపసర్పంచ్ శ్రీనివాస్ గౌడ్ తో పాటు హెరిటేజ్ సిబ్బంది పాల్గొన్నారు.

# రేవంత్‌రెడ్డితో కలిసి ప్లీనరీకి తరలిన అయిలయ్య

నవతెలంగాణ- ఆలేరుటౌన్ /ఆలేరురూరల్



తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి తో కలసి కాంగ్రెస్ పార్టీ జాతీయ ప్లీనరీ సమావేశానికి చత్తీస్ ఘడ్ రాష్ట్రం రాయపూర్ కి కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బీర్ల ఐలయ్య శుక్రవారం తరలి వెళ్లారు. ఆయనతోపాటు ఆ పార్టీ ముఖ్య నాయకులు ఉన్నారు.

# సంజీవరెడ్డికి సన్మానం

నవతెలంగాణ- ఆలేరురూరల్



ఐఎన్‌టీయూసీ జాతీయ నేత సంజీవరెడ్డిని న్యూఢిల్లీలో వారి నివాసంలో ఆలేరు మండలం కొల్లూరు గ్రామానికి చెందిన టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి జనగాం ఉపేందర్ రెడ్డి కలిసి శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఉపేందర్ రెడ్డి మాట్లాడుతూ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం అలుపెరుగని పోరాటం చేస్తున్న నాయకుడు సంజీవరెడ్డి అని అన్నారు.

# కేసారంలో కంటి వెలుగు

నవతెలంగాణ- భువనగిరి రూరల్

మండలంలోని కేసారం గ్రామంలో కంటి వెలుగు క్యాంపును శుక్రవారం జెడ్పీటీసీ బీరు మల్లయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంధత్వ నివారణ కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పోతుల కృష్ణ యాదవ్, ఎంపిటిసి పాశం శివానంద్, కంటి వెలుగు టీం వైద్యాధికారి డాక్టర్ రమాదేవి, పర్యవేక్షకురాలు ప్రఫుల్లాదేవి,సునీత,రమ, హరి దేవి సాయికృష్ణ,శివాని ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

# జర్నలిస్టులను దూషించిన సర్పంచ్ భర్త పై కేసు నమోదు

నవతెలంగాణ-బొమ్మలరామరం

న్యూస్ కవరేజ్ కి వెళ్ళిన జర్నలిస్టులను దూషించిన బొమ్మలరామారం మండలం లక్ష్మీ తండ గ్రామానికి చెందిన సర్పంచ్ భర్త ధీరావత్ రాజన్ నాయక్ పై భువనగిరి పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు. చీకటి మామిడి గ్రామ రెవెన్యూ శివారులోని ఇటుకబట్టిలో పనిచేస్తున్న ఒరిస్సా కార్మికుడు మృతిచెందగా భువనగిరి ఏరియా ఆసుపత్రికి తీసుకువచ్చారు. ఈ విషయం తెలుసుకున్న పలువురు జర్నలిస్టులు సంఘటనకు సంబంధించిన పూర్వపరాలు తెలుసుకొని ఆసుపత్రిలోని మార్చురీలో ఉన్న మృతదేహం వీడియో తీస్తుండగా రాజన్ నాయక్ అక్కడికి వెళ్లి జర్నలిస్టులను పరుష పదజాలంతో దూషించడమే కాకుండా వీడియో చిత్రీకరణ చేసిన మొబైల్ ఫోన్ ను వారి నుంచి బలవంతంగా గుంజుకున్నారు. ఫోను నేలకు విసిరికొట్టే క్రమంలో అక్కడే ఉన్న మరో రిపోర్టర్ ఫోను లాక్కున్నాడు. రాజన్న నాయక్ అనుచితంగా వ్యవహరించిన తీరుపై జర్నలిస్టులు శివకుమార్, కిషన్ ఫిర్యాదు చేశారు. రాజన్ నాయక్ పై ఐపిసి 341, 504 సెక్షన్ల కింద భువనగిరి పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# కుక్కల నివారణకు చర్యలు తీసుకోవాలని వినతి

నవతెలంగాణ-చౌటుప్పల్

చౌటుప్పల్ మున్సిపాలిటీలోని 20 వార్డుల్లోని ప్రజలపై దాడి చేసి గాయపర్చుతున్న కుక్కల నివారణకు చర్యలు తీసుకోవాలని కోరుతూ కౌన్సిలర్ల సంఘం జిల్లా అధ్యక్షులు ఎమ్.డి.బాబాషరీఫ్ ఆధ్వర్యంలో శుక్రవారం మున్సిపల్ కార్యాలయంలో ఇన్‌ఛార్జీ కమిషనర్ భాస్కర్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. వార్డుల్లో కుక్కలు గుంపులుగుంపులుగా ఉండి చిన్నాపెద్దా తేడా లేకుండా ప్రజలపై దాడులు చేస్తూ తీవ్రంగా గాయపర్చుతున్నాయని తెలిపారు. తక్షణమే కుక్కలపై తగు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు బండమీది మల్లేశం, ఆలె నాగరాజు, సుల్తాన్ రాజు, బీఆర్ఎస్ నాయకులు బొడిగె బాలకృష్ణగౌడ్ ఉన్నారు.

**కుక్కల బెడద నుండి ప్రజలను కాపాడాలని వినతి**

స్వైర విహారం చేస్తూ ప్రజల ప్రాణాలను తీస్తున్న వీధి కుక్కల బెడద నుండి ప్రజలను కాపాడాలని కోరుతూ సామాజిక ఉద్యమకారుడు కట్టెల లింగస్వామి ఆధ్వర్యంలో శుక్రవారం చౌటుప్పల్ ఆర్డీఓ కార్యాలయంలో ఆర్డీఓ వెంకట ఉపేందర్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. అన్ని గ్రామాల్లో వీధి కుక్కల సమస్య తీవ్రంగా ఉందని తెలిపారు. పసిపిల్లలను ఆడుకోవడానికి ఇంటి నుండి బయటకు పంపించలేని భయానక పరిస్థితి ఏర్పడిందన్నారు. పెద్దవారు సైతం రాత్రి వేళల్లో బయటకు వెళ్లలేని పరిస్థితి ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సామాజిక ఉద్యమకారులు బోయ కుమార్, పి.నవీన్ ఉన్నారు.




# కంటి వెలుగును ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి

నవతెలంగాణ- ఆలేరుటౌన్

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా రెండో విడత ప్రవేశపెట్టిన కంటి వెలుగు ప్రోగ్రాం ను ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని కంటి వెలుగు సూపర్వైజర్ యాకయ్య తెలిపారు. మండల కేంద్రంలోని రహదారి బంగ్లా వద్ద కంటి వెలుగు కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మొత్తం 61 మంది కంటి వెలుగు సేవలు పొందగా , 26 మంది పురుషులకి , 35 మంది స్త్రీలకి కంటి వైద్య పరీక్షలు నిర్వహించడం జరిగింద న్నారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ కిష్టయ్య , కంటి వెలుగు డాక్టర్లు ఝాన్సీ, మనీషా,ఉమా, సూపర్వైజర్ కిష్టయ్య ఆరోగ్య సిబ్బంది స్వరాజ్యలక్ష్మి, నిర్మల , అనిత , ఆశా కార్యకర్తలు మాదాసు వాణి, మంజుల ,కె.లలిత, జి.విజయలక్ష్మి, రామచంద్రారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



# ఐటీఐలో ప్రయివేటు అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలి

నవతెలంగాణ -ఆలేరుటౌన్

ప్రభుత్వ ఐటీఐలో వివిధ రంగాలలో పనిచేస్తున్న ప్రయివేటు అభ్యర్థులు ఈనెల 28వ తేదీలోగా ఆలేరు ఐటీఐ కళాశాలలో ప్రత్యక్షంగా హాజరై దరఖాస్తు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ బి.హరికృష్ణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఐటీఐ, సీఓ ఈ , ఎస్ సీటీటీ ఉత్తీర్ణులైన అభ్యర్థులు ఏదైనా ప్రభుత్వ లేదా ప్రయివేటు ఎస్టాబ్లి మెంట్ సంస్థలో మూడేళ్ల అనుభవంతో , జిపిఎఫ్ ఈపీఎఫ్ ఖాతా కలిగి ఉండాలని పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 25 సీట్లు ఉన్నాయని మరిన్ని వివరాలకు వివరాలకు స్థానిక ఐటీఐ కళాశాల లో సంప్రదించాలని కోరారు.

## స్థల పరిశీలన

**నవతెలంగాణ -ఆలేరుటౌన్**

బీజేపీ చేపట్టిన భరోసా శక్తి కేంద్ర కార్నర్ సమావేశానికి రాష్ట్ర అధ్యక్షులు బండి సంజయ్ కుమార్ శనివారం మండల కేంద్రంలోని సమావేశానికి రానున్నన, సందర్భంగా స్థల పరిశీలనకు జిల్లా ఇంచార్జ్ నందకుమార్ యాదవ్ తొ కలిసి, రాష్ట్ర నాయకులు సుదగాని హరిశంకర్ గౌడ్ శుక్రవారం పట్టణంలో స్థల పరిశీలన చేశారు.. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ రాష్ట్ర నాయకులు పడాల శ్రీనివాస్, వట్టిపల్లి శ్రీనివాస్ గౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శి రాఘవుల నరేందర్ , ఆలేరు అసెంబ్లీ కన్వీనర్ చిరిగే శ్రీనివాస్ , కౌన్సిలర్ సంగు భూపతి , జిల్లా కార్యదర్శి సముద్రల కల్పన , రాష్ట్ర ఓ.బి.సి నాయకులు కామిటికారి క్రిష్ణ, జహంగీర్ పాల్గొన్నారు.

## ఆలయ నిర్మాణపనులకు శంకుస్థాపన

**నవతెలంగాణ -రామన్నపేట**

మండలంలోని బోగారం గ్రామంలో నూతనంగా నిర్మించనున్న శ్రీ రేణుక ఎల్లమ్మ దేవాలయంతో పాటు బొడ్రాయి ఏర్పాటుకు శుక్రవారం గ్రామ సర్పంచ్ అంతటి పద్మ రమేష్ భూమి పూజ చేసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ పద్మ రమేష్ మాట్లాడుతూ రానున్న రెండు నెలల్లో దేవాలయ నిర్మాణాన్ని పూర్తిచేసి మే నెలలో బేతోజు సత్యనారాయణ శాస్త్రి ఆధ్వర్యంలో గ్రామంలో బొడ్రాయిని నెలకొల్పి శ్రీ రేణుక ఎల్లమ్మ తల్లి కళ్యాణ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించనున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ గోగు పద్మ సత్తయ్య, ఉపసర్పంచి జిల్లా శ్రీనివాస్, జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్ జెల్లా మార్కండేయ, మాజీ వైస్ ఎంపీపీ బద్దుల ఉమా రమేష్ యాదవ్, నాయకులు అంతటి మల్లేష్ గౌడ్, చలమల్ల నరసింహారెడ్డి, గంపల శ్రీపతి రెడ్డి, పబ్బు ధనుంజయ, మధ్యపురి ఐలయ్య, మాజీ ఎంపీటీసీ మేడి రామలింగం, కందగట్ల శ్రీనివాస్, మధ్యపురి సత్యనారాయణ, మద్దెపూరి పద్మయ్య తదితరులు పాల్గొన్నారు.

## కోతులను తరిమికొట్టిన గ్రామస్తులు

**నవతెలంగాణ -ఆలేరురూరల్**

ఆలేరు మండలం శర్బనాపురం గ్రామంలో 500 జనాభా ఉండగా అందుకు పోటీగా 500 కోతులు ఉన్నాయి. గురువారం సాయంత్రం గ్రామ ఉపసర్పంచ్ గడ్డమీద నరేష్ డప్పు సాటింపు చేసి శుక్రవారం ఉదయం ఆరు గంటల సమయంలో ప్రతి ఇంటి నుండి ప్రతి ఒక్కరూ రావాలని కోరారు అందుకు. శుక్రవారం ఇంటికి ఒక్కరుగా కట్టే తీసుకొచ్చి తండోపతండాలుగా ఇండ్ల మీద ఉన్న కోతులను ఊరికి మూడు కిలోమీటర్ల దూరంలో వెళ్లగొట్టారు. ప్రతి ఒక్క ఇంటి నుండి ప్రతి ఒక్కరు రావడంతో గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బాబు, పరశురాములు, సత్తయ్య ,రామచంద్ర ,మల్లేష్ ,ఉపేందర్ ,కృష్ణ, మహేందర్, ఉపేందర్, ముత్తిరెడ్డి ,నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## నట్టల నివారణా మందులు పంపిణీ

**నవతెలంగాణ- భువనగిరి రూరల్**

మండలంలోని గౌస్ నగర్ గ్రామంలో గోపాలకృష్ణ గొర్రెల మేకల సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం నటల నివారణా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా గ్రామ సర్పంచ్ ఈర్ల పుష్పమ్మ కృష్ణ, ఉప సర్పంచ్ సాయిరెడ్డి పోషిరెడ్డి, మండల ఉప పశువైద్యాధికారి డాక్టర్ నరసింహ యాదవ్,శ్రీ గోపాలకృష్ణ సంఘం అధ్యక్షులు, గొర్రెల మేకల పెంపకందారుల సంఘం మండల కార్యదర్శి పాక జహంగీర్ యాదవ్ హాజరై, మాట్లాడారు. గొర్రెల కాపరులు నట్టల నివారణ మందులను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు స్వాతి కుమార్ గౌడ్, సాయి రెడ్డి పావని జంగా రెడ్డి, మాజీ ఉపసర్పంచ్ పాక వెంకటేశ్ యాదవ్, గొర్ల కాపరులు గొర్ల రాములు, పాక కిష్టయ్య, ఇస్తారి, పాక ప్రసాద్, గొర్ల మహేందర్ పాల్గొన్నారు.

## స్వామివారి తిరుకల్యాణ మహోత్సవం

**నవతెలంగాణ-వలిగొండ రూరల్**

మండల పరిధిలోని ముద్దాపురం గ్రామంలో అర్చకులు డింగిరి శేషాచార్యులు ఫణి కుమార్ చేతుల మీదుగా యాగశాల ద్వారా తోరణార్చన, చతుస్థానార్చన, హోమం బలి ప్రధానం, శ్రీ ధర్మపురి లక్ష్మీ నరసింహ స్వామి కల్యాణం వైభవంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పెద్దిరెడ్డి ఉప్పల్ రెడ్డి, ఎంపీటీసీ సామ రాంరెడ్డి, ఆలయ చైర్మెన్ సామ నర్సిరెడ్డి, టిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు తుమ్మల వెంకటరెడ్డి, ఎమ్మె లింగ స్వామి, శ్రీ ధర్మపురి లక్ష్మీనరసింహస్వామి వారి దేవాలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## రైతులకు శిక్షణ

**నవతెలంగాణ-తిరుమలగిరి**

తిరుమలగిరి మండలం తొండ గ్రామం,మామిడాల గ్రామ రైతు వేదికలలో వ్యవసాయ శాఖ , ఉద్యాన శాఖ సంయుక్త ఆధ్వర్యంలో రైతులకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ఉద్యాన శాఖ అధికారిణి స్రవంతి మాట్లాడుతూ నీటి వసతి సంవత్సరం పొడుగుతా ఉన్న రైతులు ఫామాయిల్ పంట వేసుకుంటే రాబోయే రోజులలో మంచి పంట దిగుబడి తీసుకునే అవకాశం ఉందన్నారు.ఈ పంట వేసుకోవడానికి రైతులకు ప్రభుత్వం మొక్కలకు సబ్సిడీ అందజేస్తున్నదన్నారు.పంట దిగుబడి రావడానికి నాలుగేండ్ల సమయం పడుతుందన్నారు.ఈ సమయంలో అంతర పంట వేసుకోవడానికి కూడా ప్రభుత్వం రాయితీ ఇస్తున్నదని తెలిపారు.ఒక ఎకరంలో 50 నుండి 57 మొక్కల వరకు వేసుకోవచ్చని, ఎకరానికి 12 నుంచి 15 టన్నుల వరకు దిగుబడి వస్తుందన్నారు.ఈ కార్యక్రమంలో రైతుబంధు సమితి మండలకోఆర్డినేటర్ మూల అశోక్‌రెడ్డి, వ్యవసాయ విస్తరణ అధికారులు వెంకటరెడ్డి, శ్రీను, రైతులు కారుపోతుల అంజయ్య ఇట్టె వెంకట్‌రెడ్డి, బిక్షనాయక్, అంగోతు హరిచంద్రు,గుగులోత్ ఉపేందర్ పాల్గొన్నారు.



# దళితబంధు యూనిట్లను ప్రారంభించిన ఎమ్మెల్యే

**నవతెలంగాణ-మిర్యాలగూడ**

తెలంగాణ రాష్ట్ర దళితుల అభ్యున్నతే లక్ష్యంగా ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు ప్రవేశపెట్టిన దళిత బంధు పథకం ద్వారా మిర్యాలగూడ నియోజకవర్గ వ్యాప్తంగా 25 మంది లబ్దిదారులకు మంజూరైన నాన్ - ట్రాన్స్ పోర్ట్ యూనిట్లను శుక్రవారం శాసన సభ్యులు నల్లమోతు భాస్కర్‌రావు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నల్లగొండ జిల్లా రైతు బంధు సమితి అధ్యక్షులు చింతరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, మిర్యాలగూడ మున్సిపల్ వైస్ చైర్మన్ కుర్ర విష్ణు, డీసీఎంఎస్ జిల్లా వైస్ చైర్మన్ దుర్గంపూడి నారాయణరెడ్డి, జిల్లా రైతు బంధు సమితి సభ్యులు కుందూరు వీరకోటిరెడ్డి, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ శ్రీనివాస్ నాయక్, ఎంపీపీలు నూకల సరళ హనుమంత్‌రెడ్డి, ధనవత్ బాలాజీనాయక్, ధీరావత్ నందిని రవితేజ, పుట్టల సునీత కృపయా, జడ్పీటీసీ లలిత-హతిరం, సేవ్య నాయక్, ఇరుగు మంగమ్మ-వెంకటయ్య, జిల్లా కో



ఆప్షన్ సభ్యులు మోసిన్ అలీ, మైనారిటీ నాయకులూ యూసుఫ్, పడిగాపాటి పెద కోటిరెడ్డి, మాజీ ఎంపీపీ కురాకుల మంగమ్మ, రైతు బంధు సమితి మండల అద్యక్షులు గడగోజు ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.



## స్వచ్ఛభారత్ కార్యక్రమం

**నవతెలంగాణ-మాడుగులపల్లి**

మండలంలోని ఇసుక బావిగూడెం గ్రామంలో హైదరాబాదులోని లిటిల్ ఫ్లవర్ డిగ్రీ కాలేజీ విద్యార్థులు శుక్రవారం స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు గ్రామంలోని వీధులను, పాఠశాల పరిసరాలను శుభ్రం చేశారు. స్వచ్ఛభారత్‌లో భాగంగా గ్రామపంచాయతీ విధివిధానాలను అడిగి తెలుసుకున్నారు. ప్రజాస్వామ్య విలువలు, గ్రామ పంచాయతీ ఎన్నికలు, వాటి పనితీరును విద్యార్థులకు ప్రొఫెసర్లు వివరించారు. గ్రామపంచాయతీలలో ప్రజాప్రతినిధుల పాత్ర, ప్రభుత్వ నిధుల ద్వారా జరిగే అభివృద్ధిని గ్రామంలో పరిశీలించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచి నిమ్మల గోవిందమ్మ, ఎస్ఎన్ఆర్ ఫౌండేషన్ చైర్మెన్ నిమ్మల నవీన్‌రెడ్డి, ప్రొఫెసర్లు తేనీ, నుబిన్ చార్లీ, గణేష్, విద్యార్థులు పాల్గొన్నారు.

## శక్తి కేంద్రం సమావేశం

**నవతెలంగాణ-చిట్యాలటౌన్**

చిట్యాల పట్టణ కేంద్రంలో ఇందిరా నగర్‌లో 103,104, 105, 106 బూతుల శక్తి కేంద్రం ప్రజా గోస బీజేపీ భరోసా కార్నర్ సమావేశాన్ని శుక్రవారం శక్తి కేంద్రం ఇన్‌చార్జి పల్లె ఎంకన్న అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథి శేపూరి రవీందర్ హాజరై మాట్లాడారు. అసెంబ్లీ ఎన్నికలలో బీజేపీ ఆదరించి నకిరేకల్ గడ్డపై కాషాయ జెండా ఎగిరేయాలని ప్రజలను కోరారు. కేసీఆర్ ప్రభుత్వం దళితులకు ముఖ్యమంత్రి పదవి మూడెకరాల భూమి, డబల్ బెడ్‌రూమ్ ఇండ్లు ఇచ్చి తన నిజాయితీని కేసీఆర్ నిరూపించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ కన్వీనర్ మైల నరసింహ, పట్టణ అధ్యక్షుడు కూరెళ్ళ శ్రీను, జిల్లా కార్యవర్గ సభ్యులు కోళ్ల స్వామి, పల్లపు బుద్ధుడు, పట్టణ ప్రధాన కార్యదర్శి గంజి గోవర్ధన్, కిసాన్ మోర్చా నియోజకవర్గ కన్వీనర్ జిట్ట కృష్ణ, దళిత మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మాస శ్రీనివాస్, బూత్ అధ్యక్షులు రాహుల్, కుక్కల నాగరాజు, విజయ్, పట్టణ ఉపాధ్యక్షుడు పాల రవివర్మ కొండ నరేష్ పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

**నవతెలంగాణ-పెద్దవూర**



రోడ్డు ప్రమాదంలో తీవ్రగాయాలై చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన శుక్రవారం పెద్దవూర మండలంలో జరిగింది. ఎస్ఐ పరమేష తెలిపిన వివరాల ప్రకారం.. గురువారం రామంతాపూర్ హైదరాబాద్‌కు చెందిన బొల్లేపల్లి శ్రీహరి రాజు( 46) తన మోటార్ సైకిల్ పై హాలియా నుండి పెద్దవూర పరిధిలో లింగంపల్లి గ్రామం శివారులో ఉన్న తన తోట వద్దకు వెళ్తు రాత్రి 8.30 గంటల సమయంలో లింగంపల్లి గ్రామం వద్ద ఆకస్మాత్తుగా రోడ్డు మీదికి బర్రె రావడంతో దానిని ఢీ కొట్టి కింద పడిపోయాడు. దీంతో అతని తలకు, చేతులకు గాయాలయ్యాయి. వెంటనే చికిత్స నిమిత్తం హైదరాబాద్ మలక్ పేట యశోద ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఉదయం చనిపోయారని తెలిపారు. మృతుడి అన్న శ్రీనివాస్ రాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం హైదరాబాద్ ఉస్మానియా ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు.

## మానవత్వం చాటిన ఎస్ఐ

**నవతెలంగాణ-హాలియా**



జాతీయ కబడ్డీ క్రీడాకారుడికి అండగా నిలిచారు హాలియా సబ్ ఇన్స్‌పెక్టర్ ఆఫ్ పోలీస్ క్రాంతి కుమార్. వివరాల్లోకెళ్తే హాలియా మున్సిపాలిటీకి చెందిన సందీప్ అనే విద్యార్థి జాతీయ స్థాయి కబడ్డీ క్రీడలో రాష్ట్రస్థాయిలో ఆరుసార్లు ఉత్తమ ప్లేయర్గా నిలవడంతో పాటుగా 8సార్లు నేషనల్ స్కేల్ ఇండియా విభాగానికి ఎంపిక కావడం జరిగింది. కొద్ది నెలల క్రితం హర్యానా ఇండియా కబడ్డీ మాజీ కెప్టెన్ అనుప్ కుమార్ యాదవ్ కోచింగ్ క్యాంప్ లో సందీప్ లెగ్గీ మెంట్ కి గాయం అవడం జరిగింది. లెగ్ మెంట్ తో బాధపడుతున్న సందీప్ విషయం ఎస్సై దృష్టికి వెళ్లడంతో చలించిన ఎస్సై క్రీడాకారుడికి సర్జరీ నిమిత్తం తన రెండు నెలల జీతాన్ని విరాళంగా ప్రకటించడంతోపాటు కామినేని మంచి ట్రీట్మెంట్ చేయిస్తు తన గొప్ప మనసును చాటుకున్నారు. ఈ సహాయాన్ని అభినందిస్తూ జిల్లా ఎస్పీ గారు సోషల్ మీడియాలో అభినందించారు. ఈ సహాయం పట్ల క్రీడాకారుడు తల్లిదండ్రులతోపాటు హాలియా మున్సిపాలిటీ ప్రజలు ఎస్సై ద్రాతృత్వానికి అభినందనలు తెలిపారు.

## మృతుల కుటుంబాలకు పరామర్శ

**నవతెలంగాణ-నూతనకల్**

మండలకేంద్రానికి చెందిన కాంగ్రెస్ మహిళా మండల అధ్యక్షురాలు మహేశ్వరం చంద్రకళ అత్తగారైన మహేశ్వరం కోటమ్మ, చురకంటి రామిరెడ్డి భౌతికకాయానికి కాంగ్రెస్ నాయకులు పార్టీ జెండాను కప్పి నివాళులర్పించారు.మృతులకు సంతాపం తెలిపే సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.సంతాపం వ్యక్తం చేసిన వారిలో కాంగ్రెస్ మండల అధ్యక్షులు నాగం సుధాకర్‌రెడ్డి,గ్రామఅధ్యక్షులు బొడ్డుపల్లి అంజయ్య, సర్పంచ్ తీగల కరుణశ్రీ, జిల్లా నాయకులు వలమల్ల జయకర్,దేవిరెడ్డి నర్సిరెడ్డి, ఇమ్మిరెడ్డి మల్లారెడ్డి,యాస ముత్తారెడ్డి,యాస పుల్లారెడ్డి, తీగల గిరిధర్‌రెడ్డి,బండపల్లి సాగర్.ఎల్లపల్లి వెంకన్న, ఉప్పుల వెంకన్న,దేవిరెడ్డి వెంకట్‌రెడ్డి,మద్దిరాల మండలం కిసాన్ సెల్ అధ్యక్షులు వాసిరెడ్డి శ్రీనివాసరెడ్డి,వార్డు సభ్యులు బద్దం వెంకరెడ్డి,పూజల కోటయ్య, నాగటి వెంకన్న పాల్గొన్నారు.

## మెడికల్ హబ్‌గా మారుతున్న సూర్యాపేట జిల్లా

**నవతెలంగాణ-సూర్యాపేట**

మంత్రి జగదీశ్‌రెడ్డి నాయకత్వంలో సూర్యాపేట జిల్లా మెడికల్‌హబ్‌గా మారిందని, ప్రజారోగ్యమే లక్ష్యంగా సీఎం కేసీఆర్ పాలన జరుగుతుందని బీఆర్ఎస్ పట్టణ అధికార ప్రతినిధి, అడ్వకేట్ నాతి సవీందర్, బీఆర్ఎస్ జిల్లా నాయకులు, వార్డు కౌన్సిలర్ గండూరి పావని కృపాకర్ అన్నారు.గత నాలుగు రోజులుగా స్థానిక రామలింగేశ్వర టాకీస్ పక్కన గల గండూరి జానకమ్మ వాటర్‌ప్లాంట్ వద్ద వార్డు కౌన్సిలర్ గండూరి పావనికృపాకర్ ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న ఆరోగ్య శ్రీ ఆయుష్మాన్ భారత్ ఆన్‌లైన్ కార్యక్రమాన్ని వారు శుక్రవారం సందర్శించి మాట్లాడారు.విద్యానగర్‌తో పాటు చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలు పెద్దసంఖ్యలో ఆన్‌లైన్ నమోదు కార్యక్రమంలో పాల్గొంటున్నారని తెలిపారు.ఆరోగ్య శ్రీ ఆన్‌లైన్ నమోదు కార్యక్రమం అత్యంత ప్రజాదరణ పొందిందన్నారు.ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ఆర్సీ చిలుముల శ్రీనివాసరెడ్డి, తంగెళ్ల లక్ష్మీకాంత్‌రెడ్డి, కాకి మల్లారెడ్డి, ఆరోగ్య మిత్ర రమణ, ఆపరేటర్లు జగదీష్, భూతరాజు మధు, ఇస్మాయిల్ తదితరులు పాల్గొన్నారు.

## బీఆర్ఎస్ నాయకులపై విమర్శలు చేస్తే ఊరుకోం

**నవతెలంగాణ-మద్దిరాల**

బీఆర్ఎస్ నాయకులపై విమర్శిస్తే కాలమే బుద్ధి చెబుతుందని బీఆర్ఎస్ యూత్ వింగ్ నాయకులు పాలవెందుల శ్రీనివాస్ అన్నారు.శుక్రవారం మండలకేంద్రంలో ఆయన విలేకర్లతో మాట్లాడారు.జి కొత్తపల్లి గ్రామంలో బీజేపీ నాయకులపై దాడి చేశామని ఆ పార్టీ మండల అధ్యక్షుడు చెప్పడం సరికాదన్నారు.ఎమ్మెల్యే గాదరికిశోర్‌కుమార్ చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక ఏం చేయాలో తోచక ఇలాంటి విమర్శలు చేయడం సరికాదన్నారు.ఈ సమావేశంలో బీఎర్ఎస్వీ నాయకులు వల్లపు రమేష్‌యాదవ్,గుండ్ల నాగయ్య,తొణుకునూరి రమేశ్ పాల్గొన్నారు.

## నిరుపేద వధువుకు పుస్తెమెట్టెలు బహూకరణ

**నవతెలంగాణ-నూతనకల్**

నిరుపేద కుటుంబానికి చెందిన వధువు వివాహానికి హాజరవడంతో పాటు పుస్తెమెట్టెలు ఇచ్చి ఆదుకున్న ఘనత కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు జన్నారెడ్డి వివేక్ రెడ్డికి దక్కింది.శుక్రవారం మండల పరిధిలోని ఎర్రపహాడ్ గ్రామానికి చెందిన పెరమాల్ల శ్రీనివాస్ నవ్యల వివాహానికి హాజరై వారిని ఆశీర్వదించారు.అనంతరం వారికి రూ.50 వేల ఆర్థికసాయం అందజేశారు.ఈ కార్యక్రమంలో ఉపేందర్‌రావు,పసుల యాదగిరి, చిప్పలపల్లి సందీప్,గంగుల కమలాకర్ తదితరులు పాల్గొన్నారు.